నైరుతి..!

● 24,332 హెక్టార్లలోనే వివిధ రకాల పంటల సాగు
● ప్రత్యామ్నాయంపై స్పష్టత కొరవడిన వ్యవసాయ శాఖ
● ఆందోళనలో అన్నదాతలు

● పదును వాన కోసం రైతుల ఎదురుచూపు ● ఖరీఫ్‌లో ప్రశ్నార్థకంగా వేరుశనగ సాగు



చిలమత్తూరులో జూన్ మొదటి వారంలోనే వేరుశనగ సాగుకు దుక్కిచేసిన భూమి

అదును దాటుతున్నా పదును వాన పడకపోవడంతో జిల్లాలో ఖరీఫ్ వేరుశనగ సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఎనిమిది రోజులు ముందుగానే జిల్లాను తాకాయి. సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా నమోదు అవుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే జూలై 15 వచ్చినా పదును వాన పడలేదు. దీంతో విత్తనం, ఎరువులను సిద్ధం చేసుకుని పంట సాగుకు సిద్ధంగా ఉన్న రైతులు డీలా పడ్డారు. ఈ ఖరీఫ్‌లో సబ్సిడీపై 60వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగను రైతులు తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ చెబుతోంది. సాధారణంగా జూన్ 15 నుంచి జూలై 15 దాక వేరుశనగ సాగుకు మంచి సమయమని వ్యవసాయ శాఖ చెబుతోంది. ఆ తరువాత పంట సాగు చేస్తే పెద్దగా దిగుబడి ఉండదని వ్యవసాయ శాఖ చెబుతోంది. జిల్లాలో ఈఏడాది సాధారణ సాగు విస్తీర్ణం 269167 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 24332 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగు చేశారు. మరో వారం వర్షం కురవపోతే విత్తన వేరుశనగను అంగట్లో అమ్మేస్తామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు పెంచాల్సిన అవసరం ఉంది. అయితే వ్యవసాయశాఖ మాత్రం ఈనెలాఖరు దాకా చూద్దాం. తరువాత ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెడతామని చెబుతోంది.


చిలమత్తూరు వద్ద అరకొర పదునులో వేరుశనగ సాగు



పుట్టపర్తి, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 269167 హెక్టార్లుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటి వరకు వేరుశనగతోపాటు కంది, మొక్కజొన్న తదితర పంటలు 24332 హెక్టార్లలో సాగు చేశారు. జూన్ మూడో వారం నుంచి వేరుశనగ పంటతోపాటు కంది, చిరుధాన్యాలను సాగు ప్రారంభమైంది. వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 151824 హెక్టార్లు కాగా ఇప్పటికి వరకు సాగునీటి, వర్షాధా రం కింద 15807 హెక్టార్లులోనే సాగైంది. కంది సాధారణ సాగు విస్తీర్ణం 28925 హెక్టార్లు కాగా 1614 హెక్టార్లలో సాగైంది. మొక్కజొన్న 17949 హెక్టార్లకుగాను 1696 హెక్టార్లు, రాగి 2935 హెకార్టుకుగాను 267 హెక్టార్లు, పొద్దుతిరుగుడు 691 హెకార్టర్లకు 53 హెక్టార్లు, వరి 6396 హెక్టార్లకుగాను 54 హెక్టార్లల్లో సాగైంది. పొద్దుతిరుగు, పత్తి, కొర్ర, తదితర పంటలు కూడా జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే ఆశించినంత స్థాయిలో ఏపంట కూడా సాగవలేదని వారు పేర్కొన్నారు. ఈనెలాఖరు వరకు ఖరీఫ్ సాగు ఉంటుందని భావించినా ఏమేరకు విస్తీర్ణం పెరుగుతుందో చెప్పలేని స్థితి.

లోటు వర్షపాతం..

జూన్, జూలైలో 103 మీ.మీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా 57.06 మీ.మీటర్ల లోటు వర్షపాతం నమోదైంది. ఈనేపథ్యంలో సాగు ముందుకు సాగడం లేదు. ఆలస్యంగా వర్షాలు కురిస్తే వేరుశనగకు ప్రత్నామ్నాయంగా కంది, ఉలువ, పొద్దుతిరుగు, మొక్కజొన్న, అలసంద, పెసలు, రాగి, కొర్ర, ఆరిక, సజ్జలు, సామలతోపాటు ఆముదం సాగు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. జిల్లాలో కంది, రాగి, మినుముల కిట్లు ఉచితంగా ఇస్తున్నారు. అయితే కొన్ని మండలాల్లో సిఫారసులకే పెద్ద పీట వేస్తున్నార్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో సామాన్య రైతులు ప్రైవేట్ మార్కెట్‌లో కొనాల్సి వస్తోంది. ఇక ప్రత్యామ్నాయ పంటలైనా ఉలువ, ఆలసంద, పెసలు, కొర్ర, ఆరిక, సజ్జ , సామ తదితర విత్తనాలైనా సబ్సిడీతో ఇస్తారా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. వేరుశనగ సాగు అదు ను ముగిసి, విస్తీర్ణం అంచనా వచ్చిన తరువాత ప్రత్నామ్నాయ విత్తనంపై స్పష్టత వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.



నెలాఖరు వరకు సాగు చేయచ్చు

జూలై నెలాఖరు వరకు వేరుశనగ వేసుకోవచ్చు. ఆగస్టులో ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన విత్తనానికి ప్రతిపాదనల ప్రకారం కేటాయింపులు చేస్తాం. ఇప్పటికే 60 వేల క్వింటాళ్ల సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేశాం. ఉచితంగా కంది విత్తనం కిట్లు పంపిణీ చేస్తున్నాం. వేరు శనగ సాగుకు అదును ఇంకా ఉంది. ఈనెల 16, 17 తేదీల్లో జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. వర్షం కురిస్తే సాగు విస్తీర్ణం పెరుగుతుందని భావిస్తున్నాం.

- సుబ్బారావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

హల్కూరుకు ఆదర్శ యోగం

● ప్రధాని ఆదర్శగ్రామ యోజన కింద ఎంపిక

పుట్టపర్తి టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద జిల్లాలోని అమరాపురం మండలంలోని హల్కూర్ గ్రామం ఎంపికైనట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన హల్కూర్ గ్రామాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ హల్కూర్ గ్రామాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.20లక్షలు మంజూరు చేస్తుంద న్నారు. వీటికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు అదనం అని వెల్లడించారు. ఈనిధులతో గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. హల్కూర్ గ్రామంలో అంగన్‌వాడీ భవనం, ఆర్వోప్లాంట్లు ఏర్పాటు, ఎస్సీకాలనీలో నూతన విద్యుత్ స్తంభాలు, ఎస్‌హెచ్‌జీ రీసోర్సు కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమాధికారి శివరంగప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ తదితరులున్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

బంగారు కుటుంబాల ఎంపికకు గ్రామసభలు

పీ-4 పథకం ద్వారా జిల్లాలో అర్హత ఉన్న బంగారు కుటుంబాల ఎంపికకు గ్రామసభలు నిర్వహించాలని జేసీ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. పీ-4 సర్వేలో ఎంపికైన బంగారు కుటుంబాలను పునఃపరిశీలన చేసేందుకు ప్రతి మండలంలోని పంచాయతీ కార్యాలయంలో ఈనెల 15నుంచి 20వరకు గ్రామసభలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

భలే దొంగ..!

● కెనరా బ్యాంక్ ఏటీఎంలే టార్గెట్
● పది రోజుల్లో మూడు జిల్లాల్లో ఒకే రీతిలో చోరీ
● పురంలో ఘటనతో వెలుగులోకి మరిన్ని దొంగతనాలు

హిందూపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు ఏటీఎంలే లక్ష్యంగా ఓ దొంగ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ ఏటీఎంలలో ఉన్న కొన్ని సాంకేతిక విధానాలను తనకు అనుకూలంగా మలుచుకున్నాడు. అమాయకులు నగదును డ్రా చేయడానికి ఏటీఎంకి వస్తే చాలు మాటు వేసి సునాయాసంగా చోరీ చేస్తున్నాడు. ఈక్రమంలో పది రోజుల వ్యవధిలో మూడు జిల్లాల్లో మొహానికి మాస్కు కూడా లేకుండా ఒకే రీతిలో చోరీలకు పాల్పడ్డాడు.

కెనరా బ్యాంక్ ఏటీఎంలే టార్గెట్

సాధారణంగా కెనరాబ్యాంక్ ఏటీఎంలలో డబ్బులు డ్రా చేసిన తరువాత కూడా నగదు వచ్చే బాక్సు కొద్దిసేపు తెరుచుకునే ఉంటుంది. దీనిని గుర్తించిన దొంగ ఎవరైనా అమాయకులు ఏటీఎం వద్దకు నగదు డ్రా చేయడానికి వస్తుండటాన్ని గమనించగానే, అంతకుముందే ఏటీఎం బాక్సులో నగదు వచ్చే చోట ఏటీఎం కలరున్న పలుచటి ప్లేటును బంకతో అతికిస్తాడు. ఇది తెలియని వినియోగదారులు డబ్బు డ్రా చేయడానికి ప్రయత్నిస్తారు. అయితే నగదు ఏటీఎం బాక్సులోంచి బయటకు వస్తుంది. కానీ డ్రాచేసిన వ్యక్తికి కనబడదు. దీంతో కొద్దిసేపు చూసి వారు బయటకు వెళ్లిపోతారు. తర్వాత ఈ దొంగ ఏటీఎం కార్డు పెట్టినట్లు నటించి డబ్బు తీసుకుని అక్కడి నుంచి ఉడాయిస్తాడు. డబ్బు తీసుకున్న తర్వాత కూడా బాక్సు తెరుచుకుని ఉండే సౌలభ్యాన్ని గుర్తించిన దొంగ కెనరా బ్యాంకు ఏటీఎంలను టార్గెట్‌గా చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు.



హిందూపురంలో నగదు తీసుకుంటున్న అనుమానితుడు (ఫైల్)

మూడు జిల్లాల్లో ఒకే దొంగ

కేవలం పది రోజుల వ్యవధిలో ఆ దొంగ చిత్తూరు, అనంతపురం జిల్లా గార్లదిన్నె, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని గురునాథ్ సర్కిల్ లోగల ఏటీఎంలో చోరీ చేశాడు. నాలుగు రోజుల కిందట ఉదయం 6-30కే ఓ వ్యక్తి గురునాథ్ సర్కిల్‌వద్ద ఉన్న కెనరాబ్యాంక్ ఏటీఎంలో నగదు డ్రా చేయడానికి వెళ్లాడు. నగదు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చినా డబ్బులు బయటకు రాలేదు. దీంతో ఆయన బయటకు వెళ్లిపోయాడు. తరువాత అక్కడే మాటు వేసిన దొంగ ఏటీఎంలోకి వెళ్లి రూ.7వేలు తీసుకెళ్లాడు. బాధితుడు అదేరోజు ఉదయం 10గంటల తరువాత బ్యాంక్‌కు వెళ్లి ఏటీఎం బాక్సు నుంచి డబ్బు రాకపోయినా తన ఖాతాలో నగదు కట్ అయినట్లు ఫిర్యాదు చేశాడు. బ్యాంక్ అధికారులు సీసీ ఫుటేజ్ ద్వారా మొత్తం వ్యవహారాన్ని పరిశీలించారు. ఇది చోరీ వ్యవహారమేనని భావించి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే బ్యాంక్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో ఆ బ్యాంక్‌కు సంబంధించిన టెక్నికల్ బృందం వచ్చి పరిశీలించి, మూడు జిల్లాల్లో ఒకే దొంగ ఒకేరకంగా డబ్బులు చోరీ చేసినట్లు గుర్తించారు. ఇదే విషయాన్ని పోలీసులకు బ్యాంక్ అధికారులు చెప్పారు.

జాగ్రత్తగా ఉండాలి



ఖాతాదారులు ఏటీఎంలో నగదు డ్రాచేసే సమయంలో అపరిచితులు ఏవరైనా అక్కడ ఉంటే జాగ్రత్తగా ఉండాలి. ఏటీఎం నుంచి నగదు డ్రా పై అవగాహన లేనివారు మోసపోయే అవకాశం ఎక్కువగా ఉంది. అందుకే దీనిపై అవగాహన ఉన్న వారి కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరిని తోడు తెచ్చుకోవాలి. ఏటీఎంల వద్ద నగదు తీసుకునే సమయంలో అనుమానం వస్తే వెంటనే బ్యాంకు, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయాలి. **- రాజగోపాల్‌నాయుడు, వన్‌టౌన్‌సీఐ, హిందూపురం**

స్కూల్ గ్రాంట్ గుటుక్కు!

● కాంప్లెక్స్ నిధుల వినియోగంలో అక్రమాలు
● రెండే సమావేశాలు.. రూ.లక్ష మాయం
● జిల్లావ్యాప్తంగా రూ.1.35 కోట్లు ఖర్చు
● బోగస్ ఓచర్లతో మాయ
● పైసాలేక కొత్త హెచ్‌ఎంలు లబోదిబో
● చోద్యంచూస్తున్న జిల్లా అధికారులు

బొమ్మనహాల్ మండలంలో ఓ ఏటిగడ్డున ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్‌గా కొనసాగుతోంది. ఆ పాఠశాలకు కాంప్లెక్స్ గ్రాంట్ మార్చిలో రూ.లక్ష వచ్చింది. మొత్తం డ్రా చేశారు. బోగస్ ఓచర్లతో ఖర్చు చూపించారు. హెచ్‌ఎం బదిలీ అయ్యాడు. అక్కడ బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎంను ఎల్‌పీసీ ఇమ్మని అడిగితే స్కూల్ గ్రాంట్ ఖర్చుకు సంబంధించిన ఆధారాలు చూపితేనే ఇస్తానంటున్నారు. దీంతో అక్కడ వివాదం నడుస్తోంది.

అనంతపురం విద్య, జూలై15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల పఠనా సామర్థ్యాలు పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టి నిధులు ఇస్తున్నాయి. వాటిని పాఠశాలలు, పిల్లల కోసం ఖర్చుపెట్టకుండా పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇందుకు స్కూల్ కాంప్లెక్స్ నిధుల గోల్‌మాల్ వ్యవహారమే నిదర్శనం. కూటమి సర్కారు ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌కు రూ.లక్ష చొప్పున నిధులిచ్చింది. వాటిని సంబంధిత కాంప్లెక్స్ హెచ్‌ఎంలు స్వాహా చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండు సమావేశాలు నిర్వహించి, తమ పరిధిలోని పాఠశాలలకు పైసా ఇవ్వకుండా మొత్తం ఖర్చు పెట్టినట్లు లెక్కలు చూపించేశారు. కొత్తగా ఆ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంలు కాంప్లెక్స్ గ్రాంట్‌పైపా కూడా లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. దీంతో బదిలీపై వెళ్లిన, కొత్తగా వచ్చిన హెచ్‌ఎంల మధ్య వార్ నడుస్తోంది. జిల్లా విద్యాశాఖలో ఇది హాట్ టాపిక్‌గా మారింది.



సమగ్రశిక్ష కార్యాలయం

స్కూల్ కాంప్లెక్స్ ఆశయం ఇదీ..

పాఠశాలల నిర్వహణ, అడ్మిషన్లను జిల్లా, మండలస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించలేరన్న ఉద్దేశంతో కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేశారు. ఓ ఉన్నత పాఠశాలను చేస్తారు. ఆ హెచ్‌ఎంకు కాంప్లెక్స్ పరిధిలోని 15 వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగిస్తారు. టీచర్లకు కాంప్లెక్స్ మీటింగ్‌లు నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో ప్రభుత్వం స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణకు ప్రత్యేకంగా నిధులిస్తోంది. అలాంటి స్కూల్ కాంప్లెక్స్‌లు అక్రమాలకు కేరాఫ్‌గా మారాయి. జిల్లాలో 135 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఇవి నిబంధనల మేరకు పనిచేయడం లేదు. సంబంధిత హెచ్‌ఎంలు తమకేమీ సంబంధం లేదనే భావనతో సాగుతున్నారు. కాంప్లెక్స్‌కు వచ్చే నిధులు మాత్రం ఎంచక్కా అడ్డదారుల్లో బొక్కేస్తున్నారని వాటి పరిధిలోని టీచర్లే బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

రెండే మీటింగ్‌లు.. రూ.లక్ష ఫట్..

వైసీపీ ప్రభుత్వం అంతకు ముందు రెండేళ్లపాటు కాంప్లెక్స్‌లకు పైసా కూడా నిధులివ్వలేదు. దీంతో తూతూమంత్రంగా కాంప్లెక్స్ వ్యవహారాలు సాగిస్తూ వచ్చారు. కూటమి సర్కారు కొలువుదీరాక పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నారు. దీంతో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు కూడా నిధులు చకాచకా ఇస్తున్నారు. ప్రతిస్కూల్ కాంప్లెక్స్‌కు రూ.లక్ష చొప్పున గ్రాంట్‌ను ఇచ్చారు. ఇలా జిల్లాలో 135 కాంప్లెక్స్‌లకు రూ.1.35 కోట్లు విడుదల చేశారు. అదికూడా 2024-25 విద్యా సంవత్సరం ఆఖర్లో మార్చిలో ఇచ్చారు. గత విద్యాసంవత్సరంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో మాత్రమే కాంప్లెక్స్ మీటింగ్‌లు జరిగాయి. నిబంధనల మేరకు సమావేశాలకు వచ్చే టీచర్లకు టీ, కాఫీ, బిస్కెట్, తాగునీరు వంటి వసతులు కల్పించాలి. టీచర్ల

(మిగతా 4లో...)

నేడు కొత్త చైర్మన్ ఎన్నిక

● వైస్ చైర్మన్ పోస్టుకు పోటీ
● మడకశిర నగర పంచాయతీలో ఎన్నికల సందడి



నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాట్లు

మడకశిర టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచా యతీ చైర్మన్ ఎన్నిక బుధవారం జరగనుంది. ఇందుకోసం నగర పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. ఎన్నికల అధికారిగా పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌ను కలెక్టర్ నియమించారు. నగర పంచాయతీ చైర్మన్ ప్రమాణ స్వీకారానికి అధికారులు మంగళవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజుతో పాటు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ముఖ్యనాయకులు చైర్మన్ ఎన్నిక కార్యక్రమానికి హాజరుకానున్నా రు. గతంలో చైర్మన్‌గా ఉన్న లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రరెడ్డి తమ పదవులు కోల్పోవడంతో కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది. మడకశిర నగర పంచాయతీలో మొత్తం 20వార్డులు ఉండగా అందులో ఐదుగురు టీడీపీ తరఫున కౌన్సిలర్లు గా గెలిచారు. తదనం తర కాలంలో వైసీపీ తరఫున గెలిచిన 8మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. దీంతో పార్టీ బలం 13 మందికి పెరిగింది. వీరికి ఎక్స్‌అఫీషియో మెంబర్ అదనం. ఈ పరిణామాల నేపథ్యంలో చైర్మన్ పీటం టీడీపీ వశం కానుంది. చైర్మన్‌గా టీడీపీకి చెందిన 15వ వార్డు కౌన్సిలర్ నరసింహరాజును ప్రకటించ నున్నట్లు సమాచారం. వైస్ చైర్మన్ విషయంలో కొంత అనిశ్చితి నెలకొన్నట్లు పార్టీ నాయకులు అంటున్నారు. 8వార్డు కౌన్సిలర్ ఉమాశంకర్, 4వవార్డు కౌన్సిలర్ హనుమంతుతో పాటు ఇటీ వల వైసీపీ నుంచి వచ్చిన 17వ వార్డు కౌన్సిర్ సుభద్ర నాగేంద్రలలో ఒక్కరికి వైస్ చైర్మన్ పదవి దక్కనున్నట్లు చర్చ సాగుతోంది.

కేంద్రం బిల్లుతో ప్రమాదం

● జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామకృష్ణయ్య



డీఆర్వోకి వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్ల సంఘం నేతలు

పుట్టపర్తి టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వ్యాలిడేషన్ సవరణ బిల్లును రద్దు చేయాలని జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామకృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ పెన్షనర్లు మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామకృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రం రూపొందించిన బిల్లులు అమలులోకి వస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కేంద్రం 8వ పే కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం 12వ పే కమిషన్‌ను నియమించాలన్నారు. డీఆర్ బకాయిలు తక్షణం చెల్లించి, రైల్వే, విమాన ప్రయాణాల్లో రాయితీ పునరుద్ధరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర పెన్షనర్ల కమిషన్ రికవరీ కాలాన్ని 15 సంవత్సరాల నుంచి 11 సంవత్సరాలకు తగ్గించాలని, అలాగే ఆసుపత్రుల్లో హెల్త్‌కార్డుపై నగదు రహిత వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో విజయసారథిని కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జనరల్ సెక్రటరీ నాగార్జునశెట్టి, నాయకులు ఆత్మారెడ్డి, లింగారామమోహన్, జిల్లా నలుమూల నుంచి వచ్చిన రెండు వందల మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

హిందూపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ హిందూపురం నియోజకవర్గంలో బుధవారం పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు చిలమత్తూరు మండలం నల్లరాళ్లపల్లిలో సుపరిపాలనలో ముందడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడే రచ్చబండ నిర్వహిస్తారు. 11గంటలకు లేపాక్షి మండలం బిసలమానేపల్లిలో జరిగే తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలు వివరిస్తారని అధికారులు తెలిపారు.

15హెచ్‌డిపి4 : ఎరువుల దుకాణంలో పరిశీలిస్తున్న అధికారులు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీ

ఓ షాపు సీజ్



ఎరువుల దుకాణంలో పరిశీలిస్తున్న అధికారులు

హిందూపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయశాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని బాలాజీ, బృందావనం ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను పుంగనూరు ఏడీఏ శివకుమార్, విజిలెన్స్ ఎస్‌ఐ శివన్న, హిందూపురం వ్యవసాయశాఖ ఏడీ అల్తాఫ్, సురేంద్రనాయక్ తనిఖీలు చేశారు. బాలాజీ ట్రేడర్స్‌లో 16,535 మెట్రిక్ టన్నుల అమోనియం సెల్ఫేట్, యూరియా నిల్వల్లో తేడాలున్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.4,86,214లు ఉంటుందన్నారు. అలాగే ఈపోస్ మిషన్‌లో ఎరువుల నిలువల తేడా ఉందని షాపు సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్లు అప్డేట్ చేసుకోవాలని దుకాణాల యజమానులకు సూచించారు. దుకాణం నుంచి ఏమి విక్రయించిన దానికి సంబంధించిన రసీదులను రైతులకు ఇవ్వాల న్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా అధికారులు తనిఖీలు చేస్తున్నారన్న విషయం తెలిసి కొన్ని ఎరువుల దుకాణాల యజమానులు షాపులు బంద్ చేసి వెళ్లిపోయారు.

వానొస్తుందంట..! రానున్న ఐదు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

5 లో

ఓపిక ఉంటేనే..! లేదంటే పెద్దాస్పత్రిలో వైద్యం కష్టం (4లో)

ల్యాబ్ వద్ద యుద్ధమే..



రక్త పరీక్షల రిపోర్టుల కోసం నిరీక్షణ (మధ్యాహ్నం 3.07గంటలు)

ఓపీలో డాక్టరుకు చూపించుకుని, ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించుకుంటే రిపోర్టుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. రిపోర్టు వస్తేగాని డాక్టర్లు మందులు రాయడం లేదు. రిపోర్టులను మధ్యాహ్నం 3 గంటల తరువాత ఇస్తున్నారు. దీంతో ఉదయం ఆస్పత్రికి వచ్చిన రోగులు సాయంత్రం వరకూ అక్కడే నిరీక్షించాల్సి వస్తోంది. రక్త పరీక్షలను స్త్రీ, పురుషులకు వేర్వేరుగా చేసినా, రిపోర్టులు ఒకేచోట ఇస్తున్నారు. దీంతో తోపులాట జరుగుతోంది. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అత్యవసరమైతే అంతే..



అత్యవసర విభాగంలో వీల్‌చైర్ కోసం మధ్యాహ్నం 12 గంటల నుంచి నిరీక్షిస్తున్న బాధితులు (సాయంత్రం 3.53 గంటలు)

అత్యవసర వైద్యం కోసం పెద్దాసుపత్రికి వస్తే ఉన్న ప్రాణాలు గాల్లో కలిసి పోవాల్సిందేనని బాధితులు వాపోతున్నారు. క్యాజువాల్టీలో తగినన్ని వీల్ చైర్లు, స్ట్రెచర్లు, మంచాలు అందుబాటులో లేవు. కదలలేని పరిస్థితుల్లో ఉన్న రోగులను వెంటవచ్చినవారు మోసుకుపోవాల్సి వస్తోంది. ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు ఉండాల్సి వస్తోంది. రోగులు వచ్చీరాగానే డాక్టర్లు స్కానింగ్‌కు రాస్తున్నారు. అవి చూస్తేగాని మందులు రాయడం లేదు. వార్డులకు పంపడం లేదు. స్కానింగ్‌కు వెళ్లేందుకు వీల్ చైర్‌లు, స్ట్రెచర్‌ల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

ఓపిక ఉంటేనే..!

లేదంటే పెద్దాస్పత్రిలో వైద్యం కష్టం

ఓపీలో కుదురుగా కూర్చోని వైద్యులు

గంటల తరబడి నిరీక్షిస్తున్న రోగులు

ల్యాబ్ రిపోర్టులకు యుద్ధం చేయాల్సిందే..!

క్యాజువాల్టీలో మంచానికి ఇద్దరు ముగ్గురు

అనంతపురం వైద్యం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పేదలకు పెద్ద దిక్కు అనంతపురం సర్వజన వైద్యశాల. ప్రైవేటు, కార్పొరేటు వైద్యుల వద్దకు వెళితే.. రూ.300 నుంచి రూ.500 వరకూ ఓపీ చార్జీలు వసూలు చేస్తారు. మందులకు ఎన్ని వేలు ఖర్చవుతుందో తెలియదు. ఇక అడ్మిషన్ చేసే పరిస్థితి ఉంటే పేద, మధ్యతరగతివారు అప్పులు చేయడమో, ఆస్తులు అమ్ముకోవడమో.. ఏదో ఒకటి జరుగుతుంది. అందుకే.. వేలాది మంది పెద్దాస్పత్రిని ఆశ్రయిస్తారు. రోజుకే సుమారు రెండు వేల మంది ఓపీకి వస్తారంటే.. పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కానీ ఇక్కడి వైద్యులకు ఓపీలో కూర్చునే తీరిక ఉండదు. ఇలా వచ్చి.. అలా మాయమైపోతారు. తిరిగి వస్తారో రారో తెలియదు. రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సిందే. అత్యవసర విభాగంలో వీల్‌చైర్‌లు, పడకల కొరత వేధిస్తోంది. ఈ పరిస్థితుల్లో పెద్దాస్పత్రిలో వైద్యం అందాలంటే.. రోగులకు చాలా ఓపిక ఉండాలి. వారికి సహాయంగా వచ్చే కుటుంబ సభ్యులు, మిత్రులకు సహనం తప్పనిసరిగా ఉండాలి. లేదంటే కుదరదంతే..!



ఆర్థోపెడిక్ స్త్రీ, పురుష ఓపీ వరండాలో కూర్చున్న బాధితులు (మధ్యాహ్నం 12.18 గంటలు)


పెద్దాస్పత్రిలోని పలు విభాగాలను ఆంధ్రజ్యోతి మంగళవారం విజిట్ చేసింది. మధ్యాహ్నం 12.14 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఓపీ, అత్యవస విభాగాల్లో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం కళ్లకు కట్టింది. 'ఏ డాక్టరూ కుదురుగా ఉండటంలేదు. ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించుకుంటే రిపోర్టుల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది' అని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వజన వైద్యశాలలో ఒకటి నుంచి 18 వరకు ఓపీ విభాగాలు ఉన్నాయి. జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, డెంటల్, పల్మనాలజీ, జనరల్ మెడిసిన్, సైకియాట్రీ, పీడియాట్రిక్, గైనిక్ తదితర విభాగాలవారు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ సేవలు అందించాలి. ఓపీలో డాక్టర్లకు విధులు కేటాయిస్తూ డ్యూటీ రోస్టర్ రూపొందిస్తున్నారు. వైద్యులు రోజూ దీన్ని పాటించాలి. కానీ పట్టించుకోవడం లేదు.



ఆర్థోపెడిక్ ఓపీలో పీఓపీ కోసం నిరీక్షిస్తున్న బాధితులు (మధ్యాహ్నం 2.52 గంటలు)



మానసిక జబ్బుల ఓపీ-18లో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ (మధ్యాహ్నం 12.50 గంటలు)



జనరల్ మెడిసన్ ఓపీ-2లో ఒకటో గదిలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ (మధ్యాహ్నం 12.43 గంటలు)

డాక్టర్లు వెళ్లిపోయారు..



మాది నార్పల మండలం గడ్డంనాగేపల్లి. ఆరోగ్యం బాగాలేదు. పెద్దాస్పత్రికి ఉదయం వచ్చి ఓపీ చీటీ తీసుకునేసరికి మధ్యాహ్నం 12.15 అయింది. ఈలోగా డాక్టర్లు వెళ్లిపోయారు. సాయంత్రం 3గంటలకు డాక్టర్లు వస్తారంట. చూపించుకుని బస్టాండ్‌కు వెళ్లేసరికి కనీసం 5 గంటలు అవుతుంది. ఊరికి వెళ్లడం ఇబ్బందిగా ఉంటుంది. ఏం చేస్తాం.. తప్పదు కదా..? డాక్టర్ వచ్చేదాకా ఇక్కడే ఉంటాను. **- సరోజమ్మ**

వీల్‌చైర్ లేదంట...



మాది కదిరి మండలం కరణంవారిపల్లె. మా ఆయనకు బాగాలేకుంటే కదిరికి వెళ్లాం. అక్కడ డాక్టర్లు అనంతపురం వెళ్లాలని సూచించడంతో ఇక్కడివచ్చాం. డాక్టర్లు స్కానింగ్ రాసిచ్చారు. వీల్‌చైర్ కోసం మూడు గంటల నుంచి చూస్తున్నాం. తొందరగా స్కానింగ్ చేయిస్తే దాన్నిబట్టి వార్డుకు పంపుతారంట. బాగుంటే మందులిస్తారంట. బెడ్లుకూడా లేవు. **- ప్రమీల, కదిరి**

ఓపీలో ఉండాల్సిందే...



డ్యూటీ రోస్టర్ మేరకు ప్రతి ఒక్కరూ ఓపీలో ఉండాల్సిందే. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు ఓపీ సేవలు అందిస్తున్నాం. నిర్దేశిత సమయంలో ఓపీలో లేని డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. అత్యవసర విభాగంలో కూడా డ్యూటీ రోస్టర్ ప్రకారం డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది ఉండాలి. తాకిడి ఎక్కువైతే తగిన చర్యలు తీసుకోవాలి. వీల్‌చైర్లు, స్ట్రెచర్లు, బెడ్ల కొరత నిజమే. అందుకే రోగులు నిరీక్షించాల్సి వస్తోంది. **- డాక్టర్ ఆత్మారామ్, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్**

భారీ స్కోర్ దిశగా కడప, నెల్లూరు జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మల్టీ డే క్రికెట్ పోటీల్లో కడప, నెల్లూరు జట్లు భారీ స్కోర్ దిశగా సాగుతున్నాయి. నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు మంగళవారం రెండో రోజు స్థానిక అనంత క్రీడా గ్రామంలో కొనసాగాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు-అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 237పరుగులకు ఆలౌట్ కాగా, అనంతపురం 242 పరుగులకు కుప్పకూలింది. నెల్లూరు బౌలర్ భరత్ 5వికెట్లు పడగొట్టాడు. రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన నెల్లూరు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 5వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. బ్యాటర్ ఫర్హాద్ ఖాద్రి 111పరుగులు, రోషన్ పవన్‌కుమార్ 71పరుగులు సాధించారు. మరో పోటీ కర్నూలు-కడప జట్ల మధ్య జరిగింది. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 210పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన కడప తొలిరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 117 పరుగులు సాధించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 8వికెట్లు కోల్పోయి 393 పరుగులు సాధించింది. బ్యాటర్ వంశీకృష్ణ 157పరుగులు, ఆరీఫ్ హుస్సేన్ 92పరుగులు సాధించారు. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి పోటీలను పర్యవేక్షించారు.



వంశీకృష్ణ



ఫర్హాద్‌ఖాద్రి



భరత్

వేర్వేరు ప్రాంతాల్లో
ముగ్గురి ఆత్మహత్య



మల్లప్ప(ఫైల్)

ధర్మవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో రైలు కిందపడి ముగ్గురు మృతి చెందారు. ధర్మవరం సాయినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు మల్లప్ప(53) అప్పుల బాధతో పోతుకుంట బ్రిడ్జి వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు హిందూపురం రైల్వేహెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. మల్లప్ప రెండు మగ్గాలు ఏర్పాటు చేసుకుని భార్య ప్రమీలతో కలిసి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. చేనేతలో గిట్టుబాటు ధరలు లభించకపోవడం, కుటుంబ అవసరాల దృష్ట్యా అప్పులు చేశాడు. వీటిని తీర్చే మార్గం కానరాక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

- పెనుకొండ రూరల్: మండలంలోని పుట్టపర్తికి వెళ్లే మార్గంలో రైలు కింద పడి హనుమప్పల్లి గ్రామానికి గంగాద్రి(37) ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ సజ్జప్ప మంగళవారం తెలిపారు. గంగాద్రి కొన్నేళ్లుగా సోమందేపల్లిలో నివాసముంటూ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రెండ్రోజుల కిందట మొహర్రం కోసం సొంతూరికి వచ్చాడు. ఈయన ఊర్లో గతంలో ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. ఈక్రమంలో రుణం తీర్చమని వారు ఒత్తిడి చేయడంతో మనస్తాపం చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి భార్య భువనేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నట్లు తెలిపారు.
- డి.హీరేహాళ్: మండలంలోని హడగలి గ్రామ సమీపంలో కెంచప్పకొండ దగ్గర రైల్వేట్రాక్‌పై సోమవారం రాత్రి రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని శవం పడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి రైల్వే పోలీసులకు విషయాన్ని వివరించారు. రైల్వేట్రాక్‌పై సుమారు 40 సంవత్సరాలు వయస్సు గల వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని గుంతకల్లు రైల్వే పోలీసులు తీసుకెళ్లారు. మృతుడి వివరాలు తెలిస్తే తమకు తమకు సమాచారం అందించాలని స్థానికులను వారు కోరారు.

స్కూల్ గ్రాంట్.. గుటుక్కు..!

(3వ పేజీ తరువాయి)

బోధనకు సంబంధించి టీఎల్‌ఎం మెటీరియల్ అందుబాటులో ఉంచాలి. కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ప్రతి పాఠశాలకు ఈ గ్రాంట్‌తో అవసరమైన టీఎల్‌ఎం మెటీరియల్ ఏర్పాటుకు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇవేవీ చేయకుండా అన్నీ చేసినట్లు మాయచేసి వచ్చిన రూ.లక్షను సంబంధిత కాంప్లెక్స్ హెచ్‌ఎంలు డ్రా చేసేశారు. ఇప్పుడు పాఠశాలలో ఏదైనా కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశిస్తే.. పైసాలేదని హెచ్‌ఎంలే చెబుతుండడం శోచనీయం.



సమగ్రశిక్ష కార్యాలయం

బోగస్ ఓచర్లతో స్వాహా

కాంప్లెక్స్ నిధుల విషయంలో అడిగేవారేలేరని సంబంధిత హెచ్‌ఎంలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఏడాది మార్చిలో డబ్బు పడితే వెంటనే కాంప్లెక్స్ హెచ్‌ఎంలు డ్రా చేసేసుకున్నారు. రెండు మీటింగ్‌లు జరగ్గా.. ఆ మొత్తం సొమ్ము ఖర్చయినట్లు చూపిస్తున్నారు. ఏప్రిల్‌లో ఈ నిధులపై సోషల్ ఆడిట్ చేయడానికి రాష్ట్రశాఖ నుంచి వచ్చిన ఓ ప్రైవేటు సంస్థ ప్రతినిధులు వచ్చారు. ఆ సమయంలో కాంప్లెక్స్ నిధులు ఫలానాదానికి ఖర్చు పెట్టామంటూ బోగస్ ఓచర్లతో ఓకే చేయించుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీఎల్‌ఎం ఇవ్వకుండా, కనీసం నెలకు 10 నుంచి 15 పాఠశాలలను తనిఖీ చేయకుండా, మీటింగ్‌లకు పైసా ఖర్చుపెట్టకుండానే బోగస్ ఓచర్లతో ఆడిట్ సమయంలో కొంతడబ్బు ముట్టజెప్పి ఆమోదం వేయించుకున్నారని హెచ్‌ఎంలే అంటున్నారు. ఇటీవల బదిలీలు జరిగాయి. దాదాపు 70శాతం మంది కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఇతర మండలాల పాఠశాలలకు వెళ్లిపోయారు. బదిలీలపై వెళ్లిపోతున్నామని బరితెగించి మరీ.. స్కూల్ గ్రాంట్‌ను స్వాహా చేశారు. ఆ కాంప్లెక్స్ స్కూల్‌కు వెళ్లిన కొత్త హెచ్‌ఎంలకు పాత వారు చార్జి ఇవ్వాల్సి ఉంటుంది. నిధులు పైసాలేవని చూపుతుండడంతో కొత్త హెచ్‌ఎంలు అవాక్కవుతున్నారు. కొందరు కొత్త హెచ్‌ఎంలు.. ఖర్చు పెట్టినట్లు చూపుతున్న మేరకు ఆధారాలు చూపితేనే ఎల్‌పీసీ ఇస్తామని మెలిక పెడుతున్నారు. దీంతో కొన్నిచోట్ల కొత్త, పాత హెచ్‌ఎంల మధ్య గొడవలు సాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా తమకేమీ సంబంధం లేదన్నట్లు విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు మౌనంగా ఉండడం శోచనీయమని ఉపాధ్యాయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

గ్రాంట్ విడుదల ఏపీసీ ద్వారానే..



ప్రసాద్‌బాబు, డీఈఓ

పాఠశాలలు, టీచర్లకు గ్రాంట్ సమగ్రశిక్ష ఏపీసీ మంజూరు చేస్తుంటారు. కాంప్లెక్స్ నిధులు కూడా అంతే. ఖర్చు వివరాలు కూడా సమగ్రశిక్ష అధికారులే పర్యవేక్షిస్తారు.

సమావేశాలు పెట్టి.. లెక్కలు తేలుస్తాం



శైలజ, ఏపీసీ, సమగ్రశిక్ష

పాఠశాల నిధులను నిబంధనల మేరకు ఖర్చుపెట్టాల్సి ఉంటుంది. జిల్లాలోని 135 కాంప్లెక్స్‌లకు రూ.లక్ష చొప్పున ఇచ్చాం. రెండు సమావేశాలకే మొత్తం ఖర్చయిపోయిందనడం విచిత్రమే. దీనిపై త్వరలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో సమావేశం ఏర్పాటు చేస్తాం. నిధుల ఖర్చుకు సంబంధించిన యుటిలైజేషన్ బిల్లులు తీసుకుని పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి ఉండుంటే అలాంటి వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకుంటాం.

19న జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థుల సమావేశం



పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

అనంతపురం రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు వీసీ సుదర్శన్‌రావు తెలిపారు. సమావేశానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆయన రిజిస్ట్రార్ కృష్ణయ్య తో కలిసి ఆవిష్కరించారు. కళాశాల పూర్వ విద్యార్థులు సమావేశంలో పాల్గొని తమ అనుభవం, జ్ఞానం, ఇతరత్ర విషయాలను పంచుకోవాల న్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, కళాశాల అల్యూమినీ అసోసియేషన్ సెక్రటరీ శోభా బిందు, అనేక అనంతపురం చాప్టర్ ఉపాధ్యక్షుడు విశ్రాంత ఆచార్యులు శంకర్, యూనివర్సిటీ పీఆర్‌ఓ ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతికి నివాళి

జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం పరీక్షల విభాగంలో అటెండర్‌గా పనిచేస్తున్న ఔట్‌సోరింగ్ ఉద్యోగి భూమిరెడ్డి శివారెడ్డి మంగళవారం మృతి చెందాడు. ఈసందర్భంగా సంతాప సభ నిర్వహించారు. వీసీ సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య తదితరులు శివారెడ్డి మృతికి సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె విరమణ



శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం మోటార్లను ఆన్ చేస్తున్న ఓబులు

కూడేరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులు మంగళవారం సమ్మె విరమించారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఓబులు పీఏబీఆర్ డ్యాంలోని మోటార్లను ఆన్ చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులు వేతనాలు, పీఎఫ్ తదితర డిమాండ్లను పరిష్కరించాలని సమ్మెబాట పట్టిన విషయం తెలిసిందే. కార్మికులు వంద రోజులుగా సమ్మె చేస్తుండటంతో స్పందించిన ప్రభుత్వం తక్షణం నిధులు విడుదల చేసింది. దీంతో కార్మికులు వేతనాలు తదితర డిమాండ్లను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారులు హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించారు. ప్రజల మద్దతుతోనే కార్మికుల సమ్మెను వందరోజులు చేశామని ఓబులు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు నాగేంద్రకుమార్, ఎర్రిస్వామి, రాము, వన్నూరస్వామి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆ పథకాన్ని మీరే చూసుకోండి

- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం కలెక్టరేట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం అమలును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం అమలుపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండలాల్లో ఇతర తాగునీటి పథకాలతో పాటు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం అమలును కూడా ఏఈలు పర్యవేక్షించాలన్నారు. ఈ తాగునీటి పథకానికి సంబంధించిన రూ.3.83కోట్లు ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కాంట్రాక్టర్ అకౌంట్‌లోకి ప్రభుత్వం జమ చేశారన్నారు. ఈ నిధులను కార్మికులకు ఇప్పించి, సమ్మెలో ఉన్న వారిని వెంటనే విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంప్ హౌస్‌లో, పైపులైన్లలో నీళ్ల లేకపోతే అవి పగిలిపోయే అవకాశాలున్నాయని, పైపులు పగిలిపోతే సంబంధిత కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేస్తామన్నారు. పంప్‌హౌస్‌లలో సీసీ కెమెరాలను వచ్చే శనివారానికి ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డీఈలు శిరీష, శ్రీనివాస్, ఏఈలు సురేంద్రప్రసాద్, శ్రీనివాసకుమార్, శివకృష్ణ, హరికృష్ణ నాయక్, ధనుంజయ్, ఎస్ఈ పీఏ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆముదమే మేలు

- కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు



చంద్రాయుడు

అనంతపురం అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వర్షాధారం, రబీ సీజన్‌లో బోరుబావుల కింద ఆముదం పంటను సాగు చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందని కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు ఒక ప్రకటనలో సూచించారు. ఖరీఫ్‌లో వర్షాధారం కింద ఆగస్టు నెలాఖరు దాకా ఆముదం పంటను సాగు చేసుకోవచ్చన్నారు. బోరుబావుల కింద అక్టోబరు నెల వరకు విత్తుకోవచ్చని తెలిపారు. ఎకరాకు 2 కిలోల విత్తనం సరిపోతుందన్నారు. విత్తన ఖర్చు ఎకరాకు రూ.700 నుంచి రూ.1000ల వరకు ఆముదం రకాన్ని బట్టి ఉంటుందన్నారు. నేల స్వభావం ఆధారంగా 15 నుంచి 25 రోజుల మధ్య తడి ఇవ్వాలన్నారు. ఆముదం పంటకు సోకే చీడపీడలను మందులతో సులభమైన పద్ధతిలో నివారించ వచ్చని తెలిపారు. వేరుశనగతో పోలిస్తే ఆముదం పంట సాగు ఖర్చు తక్కువన్నారు. అనిశ్చిత, తక్కువ వర్షపాతం ఉన్న సమయంలో వేరుశనగ దిగుబడి తగ్గి నష్టం తీవ్రంగా ఉంటుందన్నారు. ఆముదం పంటలో గెలలు తరచుగా ఒకదాని తర్వాత ఒకటి రావడం ద్వారా కనీస దిగుబడి దక్కే అవకాశం ఉందన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి, ఆముదం పంటను సాగు చేసుకొని, లాభాలు పొందాలని సూచించారు.

టీపీఆర్ ట్రస్ట్ అధినేత మృతి



తలారి పరశురాముడు (ఫైల్)

గుంతకల్లు టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): అంతవరకు ఆనందంగా డ్యాన్స్ చేసిన వ్యక్తి ఉన్నఫలంగా మృతిచెందిన సంఘటన మంగవారం ఉదయం నార్పల మండలం గూగూడులో జరిగింది. గుంతకల్లుకు చెందిన టీపీఆర్ ట్రస్ట్ అధినేత తలారి పరశురాముడు(53) మంగళ వారం గుండె పోటుతో మృతి చెందాడు. పరశురాముడి కుమారుడు రామ్‌చరణ్‌తేజ్ గూగూడు కుళ్లాయస్వామి దేవాలయంలో జరిగే కందురి కార్యక్రమానికి కుటుంబ సమేతంగా సోమవారం సాయంత్రం వెళ్లారు. మరుసటి రోజు ఉదయం 10 గంటలకు పరశురాముడు కొద్ది సేపు డ్యాన్స్ చేసి కూర్చున్నాడు. తర్వాత కొద్దిసేపటికి ఉన్నఫలంగా కుప్పకూలి పోయాడు. కుటుంబసభ్యులు వెంటనే నార్పల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. తలారి పరశురాముడు టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా పని చేశాడు. 2014లో సమైక్య ఆంధ్ర పార్టీ తరఫున గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయాడు. తరువాత టీపీఆర్ ట్రస్ట్‌ను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడు. పరశురాముడుకు భార్య తలారి శకుంతలమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. పరశురాముడు మృత దేహానికి ఎమ్మెల్యే సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, టీడీపీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బొలెరో ఢీకొని వ్యాపారి మృతి

కదిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కదిరి-మదనపల్లి రోడ్డులో మిస్టర్ టీ దుకాణం ఎదురుగా మంగళవారం బొలెరో వాహనం ఢీకొని వ్యాపారి గంగన్న (56) మరణించాడు. సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అడపాల వీధికి చెందిన గంగన్న ద్విచక్రవాహనంలో చింతపండు తీసుకెళ్లి, విక్రయిస్తుండేవాడు. అందులో భాగంగా మంగళవారం కదిరి-మదనపల్లి రోడ్డులోని మిస్టర్ టీ దుకాణం ఎదురుగా వాహనం బైక్ నిలిపి, అక్కడే కూర్చున్నాడు. అతివేగంతో వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగన్నను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలిస్తుండగా మృతిచెందినట్లు సీఐ తెలిపారు. గంగన్న భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించారు. బొలెరో వాహన డ్రైవర్ షేక్ షాహీర్‌బాషాపై కేసు నమోదు చేశామన్నారు. గంగన్నకు పిల్లలు లేరు.

పోస్టుమార్టం ఆలస్యం.. బంధువుల ఆందోళన



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

గంగన్న మృతదేహానికి పోస్టుమార్టం చేయడంలో వైద్యులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ అతడి బంధువులు.. ఆస్పత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు. పోలీసులు రిపోర్టు ఇవ్వకుండానే తాము పోస్టుమార్టం చేయలేమని వైద్యులు చెప్పారు. పోస్టుమార్టం చేసేలోపే రిపోర్టు ఇచ్చామని పోలీసులు చెప్పారు. మొత్తంమీద పోస్టుమార్టం చేయడంలో వైద్యులు నిర్లక్ష్యం వహించారని మృతుని బంధువులు ఆవేదన చెందారు.

ఈజీగా.. కొట్టుకెళ్లారు..!



రామాంజులమ్మ

నల్లమాడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలోని గొలుసు లాక్కెళ్లాలంటే దుండగులు పెద్ద పథకమే వేస్తారు. చాలా రిస్కే తీసుకుంటారు. నడుచుకుంటూ వెళ్తున్న, ఇళ్లు, దుకాణాల్లో ఉన్న మహిళల మెడలోని గొలుసును అకస్మాత్తుగా లాగేస్తుంటారు. ఒక్కోసారి గొలుసును మహిళలు గట్టిగా పట్టుకుంటే బైక్‌లోని దుండగులు కిందపడిపోయిన సందర్భాలున్నాయి. అలా.. పోలీసులకు కూడా దొరికిపోయారు. మరికొందరు గాయాలపాలయ్యారు కూడా. నల్లమాడలో మాత్రం చాలా ఈజీగా గొలుసు కొట్టుకెళ్లారు దొంగలు. మండలకేంద్రంలోని గ్రామీణ బ్యాంకు పక్కన సుధాకర్‌రెడ్డి ఎలక్ట్రికల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఆయన భార్య రామాంజులమ్మ షాపులో ఉన్నారు. ఆ సమయంలో ఇద్దరు దుండగులు షాపు వద్దకొచ్చారు. గమ్ కావాలని అడగ్గా.. ఆమె ఇచ్చారు. దుండగులు రూ.వంద నోటు ఇచ్చారు. ఆమె చిల్లర ఇస్తుండగా.. 'పెద్దమ్మా.. నీ మెడలోని బంగారు గొలుసు ఇలా ఇవ్వు.. చూసి.. ఇస్తామన్నా'రు. ఆమె గొలుసు ఇచ్చేశారు. ఓ పేపర్ ఇవ్వమనగా.. ఆమె ఇచ్చారు. చిల్లర ఇస్తుండగా.. దుండగులు పరుగెత్తుకుంటూ వెళ్లిపోయారు. దీంతో రామాంజులమ్మ లబోదిబోమంటూ విషయం భర్త సుధాకర్ రెడ్డికి చెప్పింది. అతడు.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైసీపీ కార్యకర్తపై కేసు

బత్తలపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త బండి కిష్టప్పపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి శ్రద్ధాంజలితో కూడిన ఫొటోను బండి కిష్టప్ప తన మొబైల్‌లో వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. ఇది గమనించిన టీడీపీ నాయకులు కాకర్ల సురేంద్రనాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థి అదృశ్యం



దేవభూషణ్

కణేకల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లో గల గురుకుల పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి దేవభూషణ్ సోమవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. కళ్యాణదుర్గం నియోజకవర్గం పిల్లలమర్రి గ్రామానికి చెందిన హనుమప్ప కుమారుడైన దేవభూషణ్ సోమవారం రాత్రి పాఠశాల హాస్టల్ నుంచి కనిపించకుండా పోయాడు. ఉపాధ్యాయులు ఈ విషయంపై తల్లిదండ్రులకు సమాచారం అందించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎద్దు పొడవడంతో రైతు మృతి

రొద్దం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన రైతు బండి వెంకటప్ప(70)ను ఎద్దు పొడవడంతో మృతి చెందాడు. బంధువులు తెలిపిన మేరకు వెంకటప్ప మంగళవారం ఉదయం 11గంటలకు ఇంటి పక్కనే ఉన్న పొలంలో ఎద్దును పట్టుకునేందుకు వెళ్లాడు. అది పొడవడంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి అతడి తల తగిలింది. దీంతో అక్కడే కుప్పకూలిపోయాడు. బంధువులు పరిశీలించి, మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. ఎస్ఐ నరేంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించిం, కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండకు తరలించారు.

హోదాలు మారాయ్..

భూసంరక్షణ విభాగంలో మార్పులు
జిల్లాకు ఈఈ, డీఈఈ పోస్టులు మంజూరు

అనంతపురం అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): భూసంరక్షణా విభాగ అధికారుల హోదాను ప్రభుత్వం మార్పు చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు భూసంరక్షణ విభాగంలో వ్యవసాయాధికారి (ఏఓ), వ్యవసాయ సహాయ సంచాలకుడు (ఏడీఏ), వ్యవసాయ ఉప సంచాలకుడు (డీడీఏ), వ్యవసాయ సంయుక్త సంచాలకుడు (జేడీఏ) హోదా అధికారులు ఉండేవారు. ఏఓను ఏఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)గా, ఏడీఏను డీఈఈ (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)గా, డీడీఏను ఈఈ(ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)గా, జేడీఏను ఎస్ఈ(సూపరింటెండెంట్ ఇంజనీర్)గా హోదాలు మార్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాకు ఒక్కో ఈఈ, డీఈఈ పోస్టులను కేటాయించింది.

గండం.. గట్టెక్కించారు..!

పూర్తయిన హెచ్చెల్సీ మరమ్మతులు
నీటి సరఫరాకు మార్గం సుగమం
గండ్ల భయానికి స్వస్తి



నాగేపల్లి వద్ద పూర్తయిన బ్రిడ్జి

కణేకల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి లోనైన తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)పై కూటమి ప్రభుత్వ శ్రద్ధ పెట్టింది. యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులను పూర్తి చేసింది. రూ.35 కోట్ల వ్యయంతో కణేకల్లు హెచ్చెల్సీ పరిధిలో పలు పనులను పూర్తి చేసి, నీటి సరఫరాకు మార్గం సుగమం చేశారు. గత వైసీపీ పాలకులు కాలువ ఆధునికీకరణ కోసం రూపాయి కూడా ఖర్చు చేసిన పాపాన పోలేదు. చిన్నచిన్న మరమ్మతులు కూడా చేయకపోవడంతో ఐదేళ్ల వైసీపీ పాలనలో హెచ్చెల్సీకి పలుసార్లు గండ్లు పడి, నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడ్డాయి.

కూటమి పాలనలో పూర్వ వైభవం

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హెచ్చెల్సీపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హెచ్చెల్సీ మరమ్మత్తుల కోసం నిధులు సాధించడంలో సఫలీకృతులయ్యారు. డీ.హీరేహాళ్ మండలంలోని మల్లికేతి బ్రిడ్జికి రూ.1.20 కోట్లు, నాగలాపురం బ్రిడ్జికి రూ.1.60 కోట్లు, బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహొన్నూరు బ్రిడ్జికి రూ.1.60 కోట్లు, కణేకల్లు మండలంలోని నాగేపల్లి బ్రిడ్జికి రూ.1.47 కోట్లు, యర్రగుంట వద్ద ఉన్న యూటీకి రూ.4.10 కోట్లు ఇక 115 కి.మీ. నుంచి 136 కి.మీ. వరకు లైనింగ్ పనులకు దాదాపు రూ.7.42 కోట్లు నిధులను కేటాయించారు. ఆ మేరకు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేశారు. దీంతో నీటి సరఫరాకు ఢోకా లేకుండా పోయింది. ప్రధానంగా యూటీల వద్ద లైనింగ్ సక్రమంగా లేనిచోట గతంలో పలుసార్లు గండ్లు పడి రైతులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం అలాంటి చోట్ల పనులు పూర్తవడంతో రైతులకు ఇబ్బంది లేకుండా ఉండవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. కూలిపోయిన బ్రిడ్జి స్థానంలో నూతనంగా నిర్మించారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తిచేయడంతో కాలువకు పూర్వ వైభవం వచ్చింది.

> హెచ్చెల్సీకి నీరు వదులుతున్నారంటే అందరూ సంతోషపడాలి. గత ఐదేళ్లూ భయపడేవారు. ఎక్కడ గండ్లు పడతాయో, కాలువ తెగిపోతుందోనని ఆందోళన చెందేవారు. అధికారుల్లో ఒకటే టెన్షన్. కాలువ సామర్థ్యం కన్నా చాలా తక్కువ మొత్తంలో నీటిని ప్రవహించేవారు. అయినా, గండ్లు పడేవి. నీటి సరఫరాను ఆపి, మరమ్మతులు చేయాల్సి వచ్చేది. గండ్లు పడిన చోట నీరు పొలాలను ముంచెత్తేది. దీంతో రైతులు నష్టపోయేవారు. ఇలా.. ఐదేళ్లూ భయం.. భయంగా.. సాగిపోయింది. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే అందుకు కారణం. ఐదేళ్లూ కాలువ మరమ్మతులు చేపట్టలేదు. పైసా కూడా నిధులివ్వలేదు. దీంతో ఏటా గండ్ల బెడద తప్పేదికాదు. కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే కాలువ మరమ్మతులు చేపట్టింది. పనులు పూర్తవడంతో నిరాటంకంగా నీరు సరఫరా కానుంది. దీంతో అన్నదాతలు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేగంగా మరమ్మతులు చేశారు



ఈ ఏడాది హెచ్చెల్సీ మరమ్మతులు చేస్తారని ఊహించలేదు. చాలా వేగవంతంగా పనులు పూర్తి చేయడం హర్షణీయం. కాలువ పటిష్టతకు మరిన్ని పనులు చేపట్టాలి.

- ఖలీద్, రైతు, కణేకల్లు

రైతులకు ఎంతో ఉపయోగకరం



హెచ్చెల్సీ మరమ్మతులు ఆయకట్టు రైతులకు ఎంతో ఉపయోగకరం. గతంలో కాలువ పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో పదేపదే గండ్లు పడి, నీటి సరఫరా నిలిచిపోయేది. మరమ్మత్తులు చేయడంతో అలాంటి పరిస్థితి ఉండకపోవచ్చని ఆశిస్తున్నాం.

- నాగభూషణం, రైతు, గంగలాపురం

80 శాతం పనులు పూర్తి చేశాం

హెచ్చెల్సీ సబ్‌డివిజన్ పరిధిలోని కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల పరిధిలో దాదాపు 80 శాతం హెచ్చెల్సీ మరమ్మతులు పూర్తి చేశాం. యుద్ధప్రాతిపదికన యూటీ, బ్రిడ్జి, లైనింగ్ పనులు పూర్తి చేశాం. కణేకల్లు ఔట్‌ఫాల్ రెగ్యులేటర్, బిదురకుంతం బ్రిడ్జి మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు ఉండవు.

- దివాకర్, హెచ్చెల్సీ డీఈ, కణేకల్లు

అనంత క్రికెటర్లపై కాసుల వర్షం

ఏపీఎల్ వేలంలో భారీ ధరలు
అత్యధికంగా గిరినాథ్‌రెడ్డికి రూ.10.05 లక్షలు
11మంది జిల్లా క్రీడాకారులకు అవకాశం



ప్రశాంత్



అర్జున్ టెండూల్కర్



మల్లికార్జున



సంతోష్



గిరినాథ్‌రెడ్డి



వినయ్‌కుమార్



వీరారెడ్డి



దత్తారెడ్డి



కమిల్



దీపక్



మనోజ్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన క్రికెటర్లపై కాసుల వర్షం కురిసింది. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)-2025లో జిల్లా వాసులకు భారీ ధరలు దక్కాయి. ఆగస్టు 8 నుంచి 24వ తేదీ వరకు విశాఖపట్నంలో ఏపీఎల్ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 14న ఆటగాళ్ల వేలం విశాఖపట్నంలో నిర్వహించారు. ఆయా ఫ్రాంచైజీలు.. జిల్లా క్రికెటర్ల కోసం భారీగానే వెచ్చించాయి. జిల్లాకి చెందిన గిరినాథ్‌రెడ్డిని రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు రూ.10.05 లక్షలకు కొనుగోలు చేసింది. వినయ్‌కుమార్ కోసం అమరావతి రాయల్స్ జట్టు రూ.7.5లక్షలు వెచ్చించింది. వీరారెడ్డిని రూ.4.20లక్షలకి సింహాద్రి వైజాగ్ జట్టు, డీబీ ప్రశాంత్‌కుమార్‌ను రూ.2.20లక్షలకి తుంగభద్ర లయన్స్, అర్జున్ టెండూల్కర్‌ను రూ.1.2లక్షలకి కాకినాడ కింగ్స్, మల్లికార్జునను రూ.90వేలకి అమరావతి, సంతోష్‌ను రూ.60వేలకు అమరావతి రాయల్స్, దత్తారెడ్డిని రూ.60వేలకు తుంగభద్ర లయన్స్, కమిల్‌ను రూ.50వేలకి సింహాద్రి వైజాగ్, దీపక్‌ను రూ.30వేలకి తుంగభద్ర లయన్స్, మనోజ్‌ను రూ.30వేలకి రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్లు కొనుగోలు చేశాయి. ఈ సీజన్‌కు మాత్రమే కాంట్రాక్టు వర్తించనుంది.

అవగాహన పెంచుకోవాలి

పంచాయతీ పురోగతి సూచిక 2.0పై శిక్షణలో జడ్పీ సీఈఓ

అనంతపురం న్యూటౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పురోగతి సూచిక 2.0పై సిబ్బంది అవగాహన పెంచుకోవాలని జడ్పీ సీఈఓ శివశంకర్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలోని పంచాయతీ వనరుల కేంద్రంలోని సమావేశ భవనంలో శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించిన ఎంపీడీఓలు, ప్రతి మండలం నుంచి ఒక పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్‌కు మంగళవారం శిక్షణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ మాట్లాడుతూ.. పంచాయతీ పురోగతి సూచిక 2.0 కింద చేపట్టాల్సిన అంశాలను వివరించారు.

నిప్పుల గుండంలో నమాజ్



అగ్నిగుండంలో నమాజ్ చేస్తున్న షఫీ

ఉరవకొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా అగ్నిగుండ ప్రవేశం చూస్తుంటాం. అగ్నిగుండంలోకి దిగి వచ్చేస్తుంటారు. ఉరవకొండలో నిప్పుల గుండంలో ఏకంగా నమాజ్ చేశారు. కణకణలాడే నిప్పులపై కూర్చుని నమాజ్ చేయడాన్ని చూసిన భక్తులు ఆశ్చర్యానికి లోనయ్యారు. పట్టణంలోని 10వ వార్డులో గల హసేన్, హుసేన్ పీర్ల చావిడిలో చిన్న పీర్ల పండుగ నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం ఏర్పాటు చేశారు. తొలుత నిర్వాహకుడు షఫీ అగ్నిగుండంలోకి దిగాడు. నిప్పులపై రుమాలు పరచుకుని, దానిపై కూర్చుని నమాజ్ చేశారు. తర్వాత సాయి కూడా అదే తరహాలో అగ్నిగుండంలో నమాజ్ చేశారు. భక్తులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. కొన్నేళ్లుగా ఈ ఆచారం కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

కనగానపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): సీఆర్‌పీఎఫ్ జవాన్ కె. మురళి అంత్యక్రియలు మంగళవారం అతడి స్వగ్రామం శివపురం గ్రామంలో జరిగాయి. సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ శ్రీరాములు, ఇతర అధికారులు జవాన్ పార్థివ దేహం ఉన్న శవపేటికను అతడి భార్య, తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం శవపేటికపై జాతీయజెండాను ఉంచి గౌరవ వందనం చేశారు. మురళికి సంబంధించిన పలు రికార్డులు, నగదును అధికారులు అప్పగించారు. అనంతరం కుటుంబికులు, బంధువులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున అంత్యక్రియల్లో పాల్గొని జవాన్ మురళికి కడసారి వీడ్కోలు పలికారు.



మురళి పార్థివ దేహంపై జాతీయ జెండాను కప్పుతున్న అధికారులు

నాన్న లేస్తాడు లేమ్మా..!

'ఏడవొద్దమ్మా..! వీళ్లందరూ వెళ్లిపోతే నాన్న లేస్తాడులేమ్మా' అని జవాన్ మురళి నాలుగేళ్ల కుమారుడు తారక్‌రామ్ తన తల్లితో అనడం అక్కడున్న అందరినీ కంటతడి పెట్టించింది. మురళి శవపేటికపై పడి భార్య పావని ఏడుస్తుంటే నాలుగేళ్ల చిన్నారి అమాయకంగా అందరివైపు చూస్తూ తల్లితో అన్నమాటలకు అక్కడున్న వారందరూ ఒక్కసారిగా బోరున విలపించారు.

అండగా ఉంటాం: ఎమ్మెల్యే పరిటాల సునీత

సీఆర్‌పీఎఫ్ జవాన్ కుటుంబానికి అండగా ఉంటామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అభయమిచ్చారు. మురళి పార్థివ దేహం వద్ద ఆమె నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. దేశసేవకుడు ఇలా మరణించడం బాధాకరమన్నారు. మురళి కుటుంబానికి పరిటాల కుటుంబం అండగా ఉంటుందని రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మురళి భార్య, తల్లిదండ్రులకు అనంతపురంలో వేర్వేరుగా రెండు సెంట్ల స్థలం. చెల్లెలు అంజలీకి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట డీసీఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేష్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ సుధాకర్ చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య ఉన్నారు.

వానొస్తుందంట..!

రానున్న ఐదు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

బుక్కరాయసముద్రం, జూలై15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు రానున్న ఐదు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త నారాయణస్వామి తెలిపారు. పలు చోట్ల తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 34.8 నుంచి 35.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కావచ్చన్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.6-24.3 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉండవచ్చని తెలిపారు. నైరుతి దిశగా గాలులు గంటకు 13-14 కి.మీ వేగంతో వీచే అవకాశము ఉంటుందని, గాలిలో తేమ ఉదయం పూట 68-73 శాతం, మధ్యాహ్నం 41-67 శాతం నమోదు కావచ్చన్నారు. అనంతపురం జిల్లాలో బుధవారం 2 మి.మీ, 17న 5 మి.మీ, 18న 25 మి.మీ 19న 15 మి.మీ, 20న 10 మి.మీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో బుధవారం 2 మి.మీ, 17న 5 మి.మీ, 18న 28 మి.మీ 19న 13 మి.మీ, 20న 15 మి.మీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు.

కంది విత్తుకోవచ్చు

రానున్న ఐదు రోజులకు వర్ష సూచన ఉన్నందున కంది పంటను జూలై రెండో పక్షం వరకు విత్తుకోవచ్చన్నారు. ముందుగ విత్తిన కందిలో ఒత్తుగా ఉన్న మొక్కలను పలుచన చేయాలి. మొక్కకు మొక్కకు మధ్య 20 సెం.మీ దూరం ఉండేలా చూసుకోవాలి. నీటి పారుదల కింద సాగు చేసిన వేరుశనగ పూత దశలో ఉంది. రైతుల ఎకరాకు 200 కిలోల జిప్సం ఎరువును ఈ దశలో వేయాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు ముందుగా విత్తిన వేరుశనగలో మొదలు కుళ్లు, రసం పీల్చే పురుగులు ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు కార్బండిజిం మాంకోజెబ్ 2గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదలు బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు.

ఎంపీడీఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నరేంద్రకుమార్



గోరంట్ల, జూలై15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎంపీడీఓ సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా గోరంట్ల ఎంపీడీఓ నరేంద్రకుమార్ ఎన్నికయ్యారు. అనంతపురంలోని జడ్పీ భవనంలో శ్రీసత్యసాయి జిల్లా ఎంపీడీఓల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షుడిగా ధర్మవరం ఎంపీడీఓ సాయిమనోహర్, ప్రధాన కార్యదర్శిగా పెనుకొండ నరేష్‌కృష్ణ, సహాయ కార్యదర్శిగా తలుపుల నసీమా, కోశాధికారిగా నల్లచెరువు రఘునాథ్‌గుప్త, కార్యవర్గ సభ్యులుగా అమరాపురం రామారావు, బుక్కపట్నం శ్రీనివాసులు, నీకేపల్లి బాలకృష్ణుడు ఎన్నికైనట్లు ప్రకటించారు.

బీటెక్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిధిలో జూన్‌లో నిర్వహించిన బీటెక్ మొదటి, రెండో సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ సెమిస్టర్ ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. బీటెక్ ఒకటి , రెండో సెమిస్టర్(ఆర్23), సప్లిమెంటరీ(ఆర్20), (ఆర్19),(ఆర్15) ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యూయేషన్ నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శివకుమార్ ప్రకటించారు. బీటెక్ మొదటి సెమిస్టర్ ఆర్23, ఆర్20, ఆర్19, ఆర్15 సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేశారు. ఫలితాలు జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కంట్రోలర్ శంకర్‌శేఖర్‌రాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి పాలిసెట్ తుది విడత కౌన్సెలింగ్

అనంతపురంరూరల్, జూలై15(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ తుది కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 17వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 17 నుంచి 19వ తేదీ వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 18 నుంచి 20వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, వెబ్ ఆప్షన్ల నమోదు చేస్తారన్నారు. ఈనెల 21న సీట్ల కేటాయింపు, పాలిటెక్నిక్ కళాశాలలో జాయిన్ కావడానికి 24 నుంచి 26వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు.

19న స్పాట్ అడ్మిషన్లు

జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగిలిపోయిన ఐవీసీ సీట్ల కోసం ఈనెల 19న స్పాట్ అడ్మిషన్లు అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తిగత అభ్యర్థులు దరఖాస్తులను అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 18వ తేదీలోగా అందజేయాలన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు.

బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోండి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల, గ్రామస్థాయి అధికారులు ఒక్కో బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన పంచాయతీ సెక్టార్, జీరో పావర్టీ పీ4 తదితర అంశాలపై డ్వామా పీడీ, జడ్పీ సీఈఓ, డీపీఓ, ఆర్డీఓ, డీఎల్డీఓలు, డీఎల్పీఓలు, ఎంపీడీఓలు, ఈఓఆర్డీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీ-4 కార్యక్రమం కింద జిల్లాలో 54వేల బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉందన్నారు. ఇందుకోసం మార్గదర్శకుల గుర్తింపు వేగంగా చేపట్టాలన్నారు. ప్రతి రోజు 3వేల మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్నారు. ప్రతి మండలం నుంచి వంద మంది, మున్సిపాలిటీ నుంచి 200 మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లికి వందనం ఈకేవైసీకి సంబంధించి మదర్ చైల్డ్ ఈకేవైసీ పెండింగ్, గ్రీవెన్స్ పెండింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ వందశాతం నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

19న స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర

ఈనెల 19న స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కింద స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమానికి సంబంధించి ప్రజలందరికీ తెలిసే విధంగా శుక్రవారం టాంటాం వేయించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై దృష్టి సారించాలన్నారు. క్లాత్ బ్యాగులను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీసీలో డీపీఓ నాగరాజునాయుడు, సీపీఓ అశోక్‌కుమార్, జెడ్పీ సీఈఓ శివశంకర్, ఆధార్ నోడల్ అధికారి నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వర్షం కోసం కాటమయ్యస్వామి ఉరేగింపు

బత్తలపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): వర్షకాలం ప్రారంభమైనా వర్షాలు కురవక పోవడంతో మండలంలోని ముస్టూరు, యర్రయపల్లి, రాఘవంపల్లి, లింగారెడ్డిపల్లి, అనంతసాగరం గ్రామాల్లో మంగళవారం కాటమయ్యస్వామిని ఉరేగించారు. కాటమ య్యస్వామిని ఊరేగిస్తే వర్షలు సమృద్ధిగా కురుస్తాయని ప్రజల నమ్మకం.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు: ఆర్డీఓ

ధర్మవరం/బత్తలపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆర్డీఓ మహేశ్ హెచ్చరించారు. ఆయన మంగళవారం ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరం మండలాలలో అనుమానాస్పద ప్రాంతాలను ఆకస్మికంగా పరిశీలించారు. అనధికారికంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను, ఎక్స్‌కవేటర్‌ను, ట్రాక్టర్‌లను, రెండు టిప్పర్లను గుర్తించి సీజ్ చేసి, జరిమానా విధించినట్లు ఆర్డీఓ తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేయాలి: ఆర్డీఓ

బుక్కపట్నం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని ఆర్డీఓ సువర్ణ పేర్కొన్నారు. ఆర్డీఓ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ నరసింహులు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకున్న సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య

ముదిగుబ్బ, జూలై 15(ఆంధ్రజ్యోతి): రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు పొందాలని పుట్టపర్తి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య పేర్కొన్నారు. మండలంలోని యాకర్లకుంటపల్లిలో మంగళవారంవ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులకు పంటల సాగుపై సలహాలు సూచనలు అందించారు. కార్యక్రమంలో మండల ఏఓ రవీంద్ర, హార్టికల్చర్ సిబ్బంది ప్రియాంక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తెగులు సోకిన కొమ్మలను దహనం చేయాలి

నంబులపూలకుంట, జూలై 15(ఆంధ్రజ్యోతి): మామిడి పంట సాగుచేసిన రైతులు ప్రస్తు తం ఎండిన, తెగుళ్ల, పురుగు బారిన పడిన కొమ్మలను కత్తరించి కాల్చివేయాలని ఉద్యాన శాఖాధికారి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెలిచెలమల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వేణుగోపాల్ మామిడితోటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మామిడిసాపై సలహాలు ఇచ్చారు. ఏఓ లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వేరుశనగ, వరి పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. అనంతరం రైతులకు కందులు మినీకిట్లను పంపిణీచేశారు. ఏపీఈఓ హరి, రైతులు వేణుగోపాల్, చంద్రమోహన్‌రెడ్డి, గోపాల్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

ధర్మవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో ప్రతి రూపాయి పేదల ఆరోగ్యానికి చేరుతుందని బీజేపీ నియోజకవర్గ కార్యదర్శి హరీశ్‌బాబు తెలిపారు. స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో ఆయన మంగళవారం ఏడుగురు లబ్ధిదారులకు రూ.5,12,451 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్యామరావు, పోతుకుంట రాజు, లక్ష్మీనారాయణ, సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ కన్వీనర్‌గా కేశప్ప

బుక్కపట్నం, జూలై 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ కన్వీనర్‌గా కనుముక్కల కేశప్పను ఎంపిక చేసినట్లు మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రకటనలో పేర్కొంది. నూతన అధ్యక్షుడు కేశప్ప మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పట్టణ కన్వీనర్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తచెరువు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వరల్డ్‌యూత్ స్కిల్ డే సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. హెచ్‌ఎం గోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ అంశాలపై పోటీలు నిర్వహించారు. ఆయా పోటీలలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు.

మెనూ పాటించకపోతే చర్యలు: పీడీ

ఓబుళదేవరచెరువు, జూలై 15(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీకేంద్రాల్లో మెనూ పాటించని కార్యకర్తలపై చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. ఆమె మంగళవారం మండలంలోని కొండకమర్ల అంగన్‌వాడీ మినీ సెంటర్‌తో పాటు ఒడీసీ 1, 3 కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీఓ గాయత్రి, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు సరిగా తీయడంలేదని తమ దృష్టికి వచ్చిందని, వాటిపై ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు చేపడతామన్నారు. ఆమెతో పాటు సీడీపీఓ గాయత్రి, సూపర్‌వైజర్లు విజయకుమారి, సత్యవతి, గంగాదేవి, సిబ్బంది లక్ష్మి, కార్యకర్తలు జయమ్మ, ఆశీర్వాదమ్మ తదితరులు పాల్గొన్నారు.


'పదివేల మందితో కలెక్టరేట్ ముట్టడి'

ధర్మవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): పదివేల మంది ఎస్సీఎస్టీ, బీసీ, మైనార్టీ, బీసీ కులసంఘాలతో కలిసి త్వరలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఎస్సీ జనసంఘం జాతీయ అధ్యక్షుడు దాసగానపల్లి కుళ్లాయప్ప, బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పూర్ణచంద్ర రావు తెలిపారు. వారు మంగళవారం ధర్మవరంలో పర్యటించి, స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈనెల 14న పుట్టపర్తిలో తాము తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని పోలీసుల ద్వారా అడ్డుకున్నారన్నారు. అనేక అక్రమాలు, నిర్బంధాలపై, మైనార్టీలపై దాడులు, బాలికల అత్యాచారాలపై త్వరలో కలెక్టరేట్ ముట్టిడి తలపెడతామన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల అత్మీయ సమావేశం

నల్లమాడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బహుజన సమాజ్‌వాదీ పార్టీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆత్మీయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంపావతి గోవిందు ఆధ్వర్యంలో... దేశ సరిహద్దులో యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం గోవిందు మాట్లాడుతూ రాష్ట్రంలో కమ్మ, రెడ్ల కులాల మధ్య బీసీలు తీవ్రంగా నలిగి, అన్యాయం అవుతున్నారన్నారు. ఇందుకు రాష్ట్రంలో జరిగిన అనేక సంఘటనలు ఉదాహరణ అన్నారు. బీఎస్పీ నాయకులు వెంకటరమణ, రామచంద్ర, షేక్ మోదీన్‌బాషా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా వాసవీమాత



ధర్మవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత ప్రతి యేటా మాదిరిగా ఆషాఢమాసం మంగళవారం పురస్కరించుకుని శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మూల విరాట్‌కు అర్చకులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని వెయ్యి కేజీల 14 రకాల పండ్లు, 22 రకాల కాయగూరలతో అలంకరించారు.

అమ్మవార్లకు బోనాలు



ధర్మవరంలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

ధర్మవరం జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాదవవీధిలో వెలసిన పెద్దమ్మ దేవతకు బోనాల మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కోటగడ్డ పెద్దమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ పూజారి రాంప్రసాద్ అమ్మవారిని వివిధ రకాల ఆకులు, అభర ణాలతో అలంకరించి పూజలు చేశారు. మహిళలు బోనాలను తలపై ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమ ర్పించారు.

● నల్లచెరువు: మండలకేంద్రంలోని ఎస్సీకాలనీలో మంగళవారం మారెమ్మకు జ్యోతులు, బోనాలు సమర్పించారు. వర్షాలు రాక మూగజీవాలకు సైతం తాగునీరు లేదన్నారు. వర్షం కోసం మారెమ్మకు బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించినట్లు కాలనీవాసులు తెలిపారు.



నల్లచెరువు ఎస్సీకాలనీలో బోనాలు తీసుకెళ్తున్న దృశ్యం

పనులు చేయకనే బిల్లులు స్వాహా..!

● మరమ్మతులకు నోచుకోని బోరు ● వృథాగా వాటర్ ప్లాంటు



పాఠశాల ఆవరణలో ఉంచిన పాత టైల్స్



మూలనపడిన వాటర్ ప్లాంటు

కదిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని బాలప్పగారిపల్లి పాఠశాలలో నాడు-నేడు పనులు చేయకనే బిల్లులు స్వాహాచేసిన వైనం వెలుగులోకి వచ్చింది. బాలప్పగారిపల్లిలోని మోడల్ ప్రైమరీ స్కూల్ మరమ్మతుల కోసం వైసీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.15 లక్షలు నాడు - నేడు కింద మంజూరయ్యాయి. ఇందులో రూ.60 వేలు పాఠశాల ఆవరణంలో టైల్స్ కోసం కేటాయించారు. ఆ పనిచేయకనే బిల్లులను అప్పటి ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి డ్రా చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన బదిలీపై వెళ్లిపోయారు. పాత టైల్స్‌ను తీసుకొచ్చి పాఠశాలలో తోలారు. వాటిని వేయడానికి ప్రస్తుతమున్న తల్లిదండ్రుల కమిటీ ఒప్పుకోలేదు. ఆ పనిచేయడానికి ముందే రూ.60 వేలు డ్రాచేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. గతంలో నాసిరకం పనులు చేసి నాడు -నేడు పనులు మమ అనిపించారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో బోరున్నా, మోటారుకు మరమ్మతులు చేయ లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. బోరుబావిలో మోటారు ఇరుక్కు పోవడంతో తాగునీటికి, ఇతర అవసరాలకు ఇబ్బంది ఏర్పడింది. పంచాయతీ బోరు నుంచి నీరు ఇస్తున్నా... గ్రామంలో చివరకున్న పాఠశాలకు చేరేపాటికి విద్యుత్ అంతరాయం, ఇతర కారణాలతో అరకొరగానే నీరు వస్తున్నాయి. పంచాయతీ బోరు చెడిపోయినప్పుడు విద్యార్థులు నీటికోసం ఇబ్బందులు పడుతున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. విద్యార్థులకు రక్షిత తాగునీటిని అందించడానికి నాడు-నేడు పనుల్లో వాటర్ ప్లాంటు మంజూరు చేశారు. వాటర్‌ప్లాంటు వచ్చినా, దాన్ని వినియోగంలోకి తీసుకురాకుండా మూలన పడేశారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి ప్రభుత్వం అందించినా, ఎందుకూ పనికిరాకుండా ప్లాంటును మూలనపడేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ స్వాహా పర్వంపై తల్లిదండ్రులు ప్రశ్నిస్తే గతంలో ఉన్న ప్రధానోపాధ్యాయుడు ఏమీ పట్టనట్లు మాట్లాడుతున్నారని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓను కోరినట్లు గ్రామస్థులు తెలిపారు. దీనిపై ఎంఈఓ చెన్నక్రిష్ణను వివరణ కోరగా... బాలప్పగారిపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాలలో పనులు చేయకుండానే బిల్లులు డ్రాచేసిన వైనం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. పరిశీలించి, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని తెలిపారు.

ప్రజలకు బాధ్యతగా ఉండే ప్రభుత్వం మాది

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



మహిళలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రజలకు బాధ్యతగా ఉండే ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డు గూడ్‌షెడ్ కొట్టాలలో మంగళవారం సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనకు స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఏ ఇంట్లో ఎంతమందికి పథకాలు అందాయా అనే వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా కాలనీలో పలు సమస్యలను స్థానికులు పరిటాలశ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి ఆయన సూచించారు. ఎప్పటి కప్పుడు ప్రజల సమస్యలను తెలుసుకోవాలని స్థానిక టీడీపీనాయకులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తమ ప్రభుత్వం మరింత బాధ్యతగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, నాయకులు రాళ్లపల్లి షరీఫ్, జింకల రాజన్న, గంగాధర్, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీపడం

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



అనారోగ్యంతో బాధపడుతున్న మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అమడగూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్క రించడంలో రాజీ పడేది లేదని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనకు తొలిఅడుగులో భాగంగా ఎమ్మెల్యే మంగళవారం మండలంలోని చినగానిపల్లి పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ... వైసీపీ గత ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్య మన్నారు. వచ్చే ఐదేళ్లలో పుట్టపర్తి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రస్థా నంలో నిలపుతామన్నారు. నియోజకవర్గంలోని 193 చెరువులు, రెండు రిజర్వాయర్లను కృష్ణాజలాలతో నింపుతామన్నారు. చినగానిపల్లి పంచాయ తీలో రామనాథపురం, బావాజీ కొత్తపల్లి, ఈడిగ పల్లి, ఆకులోళ్లపల్లి, మారుతిపురం గ్రామాల్లో ఆమె ఇంటింటా పర్యటించారు. ఆకులోళ్లపల్లిలో అనారోగ్యంతో ఆర్నెల్ల నుంచి మంచానికి పరిమితమైన నీరుగట్టి నాగరా జును పరామర్శించారు. డీఎంహెచ్‌ఓతో ఫోన్లో మాట్లాడి మెరుగైన సేవలందించాలని సూచించారు. వైద్యఖర్చులకు పెట్టిన మొత్తాన్ని సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందిస్తామని తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి, క్రిష్ణమూర్తి, శ్రీని వాసులరెడ్డి, క్రిష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, కమ్మల భాస్కర్, కాడా సిద్దు, ప్రభాకర్‌రెడ్డి, రామాంజనేయులు, రమణప్ప తదితరులు పాల్గొన్నారు.



● నల్లమాడ: మండలకేంద్రంలోని మేదరకాలనీలో టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు బుట్టి నాగభూషణనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు కోట్లో మంజునాథ్‌రెడ్డి, బయ్యారెడ్డి, పాల ఆంజినమ్మ, డీలర్ మైలే శంకర్ పాల్గొన్నారు.



● నంబులపూలకుంట: మండలంలోని వంకమద్దిలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి నరసింహులు, నాయకులు వంకమద్ది రవి, వాటర్ షెడ్ చైర్మన్ నాగేంద్ర, రఘు, నరేష్ పాల్గొన్నారు.

పీకేడీ పల్లి సొసైటీ చైర్మన్‌గా బడా రాజారెడ్డి



చైర్మన్ బడా రాజారెడ్డి

తనకల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకడపల వారిపల్లి సొసైటీ చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు బడా రాజారెడ్డిని ప్రభుత్వం నియమించినట్లు సహకార సంఘం సీఈఓ సుధాకర్ తెలిపారు. ఆయన పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతూ వచ్చారు. మండల కన్వీనర్‌గా పదేళ్ల బాధ్యతలు నిర్వహించారు. ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీ కోసం కృషి చేస్తుండడంతో అధిష్టానం గుర్తించి అని సొసైటీ చైర్మన్‌గా నియమించినట్లు ఆయన తెలిపారు. తనను ఎంపిక చేయడానికి కృషి చేసిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, సీఎం నారాచంద్రబాబునాయుడు, కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పెద్దకడపలవారిపల్లి సహకార సంఘం డైరెక్టర్లుగా వేపలపల్లికి చెందిన ఉత్తన్ననాయక్‌ను, తిరుమయ్యగారిపల్లికి చెందిన లక్ష్మణ్‌ను ప్రభుత్వం నియమించినట్లు సీఈఓ తెలిపారు.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

తనకల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని టి.సదుం గ్రామంలో మొహర్రం సందర్భంగా జరిగిన ఘర్షణలో సున్నంపల్లి వాండ్లపల్లికి చెందిన భాస్కర్ అనే వ్యక్తిపై నల్లచెరువు మండలం లోని దేవింటిపల్లికి చెందిన ఇస్మాయిల్ కట్టెతో దాడిచేసినట్లు ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఈ మేరకు నమోదైన కేసులో నిందితుడిని కొక్కంటిక్రాస్‌లో మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కదిరి అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను మంగళవారం వ్యవసాయ శాఖ ఏడీ సన్నావుల్లా తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో ఎరువుల నిల్వకు, వాటి స్టాక్ రిజిస్టర్‌కు తేడా ఉండడంతో రూ.7.56లక్షల విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపి వేశామని ఏడీఏ తెలిపారు. ఏఓ శ్రీహరినాయక్ పాల్గొన్నారు.

స్కూల్ టోర్నీ ప్రారంభం



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు

ధర్మవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీటీ క్రీడామైదానంలో స్కూల్ టోర్నమెంట్ సీజన్-3లో భాగంగా కబడ్డీ, క్రికెట్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ టోర్నమెంట్ లో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి రోజు కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ముందుగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ టోర్నీలో పాల్గొన్న విద్యార్థులను పరిచయం చేసుకుని టోర్నీని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... మానసిక స్థైర్యం, దృఢత్వం పెంపొందించేందుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. మంత్రి సత్యకుమార్ దిశానిర్దేశంలో నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పీఈటీలు రాము, భాస్కర్, ప్రత్యూష, మల్లేశ్, రమేశ్, కోచ్‌లు పృథ్వీ, రాజశేఖర్ పాల్గొన్నారు.

నిబద్ధత కల్గిన వారికి అత్యున్నత పదవులు

● మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో నిబద్ధత కల్గిన నాయకుల కు అత్యున్నత పదవులు వరిస్తాయని, అందుకు నిదర్శనం కేం ద్రమాజీ మంత్రి పూసపాటి అ శోక్ గజపతిరాజు గోవా గవర్నర్ గా నియామకమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మంగళవా రం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావు పిలుపు తో టీడీపీలో చేరి... సుదీర్ఘకాలం పాటు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా, అత్యున్న పదవులో ప్రజలకు ఎనలేని సేవలందించిన అశోక్ గజపతిరాజు ఎంతో నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేశారన్నారు. ఆయన గవర్నర్ పదివిలోనూ అదే సమర్థతతో పనిచేస్తూ రాష్ట్రానికి మంచి గుర్తింపు తెస్తారని ఎమ్మెల్యే, మాజీమంత్రి ఆకాంక్షించారు.

అశోక్ గజపతిరాజు నియామకంపై హర్షం

● నల్లమాడ: గోవా గవర్నర్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి అశోకగజపతి రాజును నియామకంపై టీడీపీ మండల నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకున్న వారికి గుర్తింపు ఉంటుందన్నారు. టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, బుట్టి నాగభూ షణనాయుడు, కోట్లో మంజునాథ్‌రెడ్డి, సలాంఖాన్, రాజారెడ్డి, మంజునాథ్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు గడ్డం రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భారం తగ్గించే మధ్యవర్తిత్వం: న్యాయాధికారి

కదిరి లీగల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారం కోసం దీర్ఘకాలంగా ఎదురు చూడకుండా సత్వర పరిష్కార మందించే ప్రత్యామ్నాయ పరిష్కార మార్గం మధ్యవర్తిత్వమని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి జయలక్ష్మి పేర్కొన్నారు. మధ్యవర్తిత్వంపై శిక్షణపొందిన ఇద్దరు న్యాయవాదులు ఏజేపీ శివప్రసాద్, న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి సురేంద్ర, సిరాజుద్దీన్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్న సమీక్షా సదస్సులో న్యాయాధికారి మాట్లాడారు, మధ్యవర్తి చట్టం దేశవ్యాప్తంగా అమలవుతోందన్నారు. ఎన్నో ప్రయోజనాలన్న మధ్యవర్తిత్వ చట్టాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జలధికి తరలిన పీర్లు



పోతుకుంట గ్రామంలో జలధికి వెళ్తున్న పీర్లు



వేపరాలలో...

ధర్మవరం రూరల్/గాండ్లపెంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పోతుకుంట, కనంపల్లిల్లో మంగళవారం పీర్లను జలధికి తరలించా రు. గ్రామస్తులు పెద్దఎత్తున చక్కెర చదివింపులు, బెల్లం సమర్పించి మొక్కులు తీర్చుకు న్నారు. అలాగే గాండ్లపెంట మండలంలోని వేపరాల గ్రామంలో పీర్ల జలధి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఎల్‌పీ నంబర్ల సమస్య పరిష్కరిస్తాం: ఆర్డీఓ

తాడిమర్రి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎల్‌పీ నంబర్ల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ మహేశ్ తెలిపారు. 'ఉన్నది నాలుగు... ఆన్‌లైన్‌లో వంద' అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆర్డీఓ మహేశ్ స్పందించారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఒకే ఎల్‌పీ నంబర్ల సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉందన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఇప్పటికే పై అధికారులకు నివేదికలు పంపామని తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. కాగా ఉద్యోగులు కాకపోయినా ఉద్యోగులైనట్లు, ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించకపోయిన చెల్లించినట్టుగా తెలుపుతూ తల్లికివందనం పథకానికి అనర్హులుగా నమోదై ఉంటే ఆన్‌లైన్‌లో పరిష్కరించవచ్చని తెలిపారు. అనంతరం స్థానిక రెవిన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఒకరిద్దరు ఉద్యోగులు చేస్తున్న తప్పుల మూలంగా రెవెన్యూ వ్యవస్థకే చెడ్డపేరు వస్తుందని అసహనం వ్యక్తం చేశారు. తహసీల్దార్ బాస్కర్‌రెడ్డి, వీఆర్‌ఓలు సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి స్పందన

అవినీతికి పాల్పడితే చర్యలు : డీఎస్

బత్తలపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డివిజినల్ సర్వేయర్ మురళీ క్రిష్ణ హెచ్చరించారు. మండలంలో విలేజ్ సర్వేయర్ల అవినీతిపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో లెక్కల కొలతలు అనే శీర్షికన కథనం వెలువడిన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఆర్డీఓ ఈ విషయంపై డివిజినల్ సర్వేయర్ మురళీ క్రిష్ణతో ఆరాతీశారు. దీంతో డివిజినల్ సర్వేయర్ బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయనికి చేరుకొని విలేజ్ సర్వేయర్లతో సమావేశమయ్యారు. డబ్బు కోసం రైతులను వేధించడం, ఇబ్బందులు పెట్టడం సరైన పద్ధతి కాదని అగ్రహం వ్యక్తం చేశారు. రీసర్వే చేసిన పంచాయతీలలో రైతులు డబ్బు ఇవ్వలేదని జాయింట్ ఎల్‌పీఎంలో పెట్టిన వారిని బదిలీ అయినా రిలీవ్ చేయవద్దని ఉన్నతాధి కారుల నుంచి ఎంపీడీఓకు ఉత్తర్వులు వచ్చినట్టు సమాచారం. కార్యక్రమంలో మండల సర్వేయర్ జోసఫ్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించకుంటే రేపు చలో విజయవాడ : సీఐటీయూ



పుట్టపర్తిలో ఆకులు తింటూ నిరసన తెలుపుతున్న కార్మికులు

పుట్టపర్తి రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమస్యలు పరిష్కరించకుంటే గురువారం చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టి రాష్ట్ర మున్సిపల్ కేంద్ర కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఇంజనీరింగ్ కార్మికులు ఆకులు తింటూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ... ప్రభుత్వంతో చర్చలు జరిపినపుడు జూలై 5 నుంచి వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. ఆ హామీని నిలబెట్టుకోనందుకు తాము ఈ నెల 12 నుంచి వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్, మునిసిపల్ ఇంజనీరింగ్ నాయకులు రమణ, గణేష్, రమేష్, రామదాసు, శివ, సద్దాం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

● ధర్మవరం: సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె 20వ రోజు మంగళవారం కొనసాగింది. అలాగే స్థానిక మున్సిపల్ కార్యా లయం ఎదుట కార్మికులు చెవిలో పూలు పెట్టుకుని రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు బొగ్గునాగరాజు, కార్యదర్శి బాబు, నాయకులు పెద్దన్న, జయకృష్ణ, కాటమయ్య, యోగేశ్, అనిల్, వరదరాజులు పాల్గొన్నారు.

కాళికాంబ.. కామేశ్వరులకు ప్రత్యేక పూజలు



రొళ్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నగిరిలో వెలసిన శ్రీకాళికాంబ, కామేశ్వర స్వామివార్లకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు సూర్యప్రకాశ్ ఆచార్ పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వడిసలమ్మకు..



మడకశిర టౌన్, (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో వెలసిన వడిసలమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వడిసలమ్మ, గంగాభవాని, కొల్హాపురి అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరణ, ప్రాకారోత్సవం, విశేష అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. కోర్కెలు తీర్చే దేవతగా భక్తులు పూజలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

నేడు ముత్తరాయస్వామి ఉత్సవాలు

అగళి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాయత్రి కాలనీలో బుధవారం ముత్తరాయిస్వామి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకుడు టిపుడి రాజన్న, వంసతకుమార్ తెలిపారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరవుతారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'కేసుల పరిష్కారానికి చొరవ చూపండి'



మాట్లాడుతున్న న్యాయాధికారి అశోక్‌కుమార్

హిందూపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, పోలీసులు పరిష్కారమార్గాలు చూపాలని ఇన్‌చార్జి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి అశోక్‌కుమార్, ప్రత్యేక న్యాయాధికారి రమణ అన్నారు. మంగళవారం కోర్టు ఆవరణంలో మధ్యవర్తిత్వంపై కక్షిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వం కక్షిదారుల సమస్య పరిష్కారంలో ఎంతో దోహదపడుతుందన్నారు. వ్యాజ్యం కన్నా మధ్యవర్తిత్వం ద్వారా కేసులను సునాయాసంగా పరిష్కరించుకోవచ్చన్నారు. ఇప్పటికే కొన్ని నగరాల్లో మధ్యవర్తిత్వ కేంద్రాలు ఏర్పాటై పరిష్కారమార్గాలను చూపుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామచంద్ర, నరసింహమూర్తి, భాగ్య, అభిలాష్ పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు: ఏఓ



చంద్రగిరిలో పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు

పెనుకొండ రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న సాగులో రైతులు సస్యరక్షణ పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ చందన పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దుద్దేబండ, చంద్రగిరి గ్రామాల్లో పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ అశోక్‌కుమార్, రైతులు లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్, (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటలు సాగు చేసిన రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప సూచించారు. మంగళవారం భక్తరహళ్లి, జిల్లేడగుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. భక్తరహళ్లి గ్రామానికి చెందిన రంగప్ప సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సోకి పంట దెబ్బ తింటున్నట్లు రైతు ఏఓ దృష్టికి తీసుకెళ్లారు. ఎకరాకు 100 గ్రాములు ఏమోమెక్టిన్ బెంజోయేట్ మందును 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలని ఏఓ సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిసెంట్ సృజన్ పాల్గొన్నారు.

'బాల్య వివాహాలను అరికట్టాలి'

అమరాపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టడమే మిషన్ వాత్సల్య ముఖ్య ఉద్దేశమని ఎంపీపీ ఈరన్న, జడ్పీటీసీ స్వరక్క నరసింహమూర్తి, సీడీపీఓ గంగరత్నమ్మ అన్నారు. మండలంలోని ఎంపీడీఓ భవన్‌లో మిషన్ వాత్సల్య పథకంపై హెచ్‌ఎంలు, అంగనవాడీ కార్యకర్తలు, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పిల్లల రక్షణ, ఆరోగ్యం, హక్కులు తదితరవాటిపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమలమ్మ, ఎస్‌ఐ ఇషాక్‌బాషా, విద్యాశాఖ అధికారి రాఘవయ్య, డాక్టర్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం అందరి బాధ్యత

● మాజీ మంత్రి రఘువీరారెడ్డి



ప్లాస్టిక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రఘువీరారెడ్డి

మడకశిర రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజం అందరి బాధ్యత అని మాజీ మంత్రి రఘువీరారెడ్డి అన్నారు. నీలకంఠాపురంలోని బీసీ హాస్టల్ విద్యార్థులు మంగళవారం గ్రామంలో ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామంటూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి పాల్గొన్నారు. ప్లాస్టిక్ ఏవిధంగా హాని చేస్తుందో విద్యార్థులకు వివరించారు.

అగళి(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌కు నో చెప్పి ప్రకృతిని రక్షించాలని అగళి బీసీ హాస్టల్‌వార్డన్ సికింద్‌బాషా సూచించారు. మంగళవారం హాస్టల్ విద్యార్థులతో ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని ప్రేమించాలని, ప్లాస్టిక్‌ను వాడవద్దని సూచించారు. బస్టాండు ఆవరణంలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు.

ప్రమాదాలకు నిలయాలు

కోడూరు తోపు కూడలిలో తరుచూ ప్రమాదాలు
టెక్స్‌పోర్టు గార్మెంట్స్ వద్ద అదే తంతు
నియంత్రణకు చర్యలు తీసుకోని అధికారులు



ఆగి ఉన్న లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు (ఫైల్)



కోడూరు తోపు సమీపంలో ప్రమాదాలు జరిగే ప్రదేశం

చిలమత్తూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): కోడూరు-పుట్టపర్తి కూడలి, టెక్స్‌పోర్టు గార్మెంట్స్ పరిశ్రమ వద్ద ఉన్న యూటర్న్ ప్రాంతాలు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ఏ ప్రదేశంలో జరుగుతున్నాయో పరిశీలనలు జరిపి నివారణకు చర్యలు చేపట్టడం అధికారుల బాధ్యత. అయితే కోడూరు తోపు నుంచి కొడికొండ చెక్‌పోస్టు మధ్యలో రోడ్డు ప్రమాదాలు తరుచూ జరుగుతున్నా నివారణకు చర్యలు తీసుకోకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా ఉంటోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా 44వ జాతీయ రహదారిలో కోడూరు-పుట్టపర్తి కూడలి అత్యంత ప్రమాదకరంగా మారింది. దీంతోపాటు టెక్స్‌పోర్టు గార్మెంట్స్ పరిశ్రమ వద్ద ఉన్న యూటర్న్ వద్ద కూడా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎక్కువగా కోడూరు తోపు నుంచి కొడికొండ చెక్‌పోస్టు వరకు ఆగి ఉన్న వాహనాలకు వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీకొనడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. సిమెంటు లోడులతో బెంగళూరు వైపు వెళ్లే లారీలు పలు సాంకేతిక కారణాలతో నడి రోడ్డుపైనే ఆగిపోతున్నాయి. ఈ కారణంగా నిలబడిన వాహనాలను సరిగా గుర్తించకపోయి వాటిని వేగంగా వచ్చే వాహనాలు వెనుక నుంచి ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవలే హైదరాబాదు నుంచి బెంగళూరు వెళుతున్న ఓల్వా ప్రైవేటు బస్సు ఆగివున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. కోడూరు తోపులో కంకర లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ని వెనుకనుంచి అతివేగంగా కంటైనర్ ఢీకొంది. ట్రాక్టర్ నుజ్జు నుజ్జు అయ్యింది. డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఇటీవలే టెక్స్‌పోర్టు గార్మెంట్స్ వద్ద మంచినీటి ట్రాక్టర్ ట్యాంకర్ యూటర్న్ తీసుకుంటుండగా వేగంగా వచ్చే లారీని తప్పించబోయి బోల్తాపడింది. గతంలో ఇక్కడ ప్రమాదాల నివారణకు వేగ నియంత్రణలు ఏర్పాటుచేసినా అవి ఏమాత్రం ఉపయోగపడలేదు. సిమెంటుతో వెళ్లే లారీలు వేగంతో దూసుకువస్తుంటాయి. ఏమాత్రం పొరపాటు జరిగినా ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందే. ఇక రోజూ వందల సంఖ్యలో గార్మెంట్స్ పరిశ్రమకు వచ్చే కార్మికులు ఆటోల్లోనే వెళుతుంటారు. వారందరూ కూడలిలో పుట్టపర్తి వైపునకే వెళతారు. దీంతో ఉదయం, సాయంత్రం కూడలి వద్ద చాలా రద్దీ ఉంటుంది. ఇది కూడా ప్రమాదాలకు కారణంగా ఉంటోంది. అధికారులు ఈ ప్రదేశాన్ని ప్రమాదకరమైనదిగా గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయడం, సాంకేతిక సమస్యతో రోడ్డుపై ఆగిపోయిన వాహనాలను పక్కకు తరలించడమో చేయాలి. అయితే ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు ఉన్నాయి.

గస్తీ తిరగని ఎన్‌హెచ్ ఎస్కార్ట్ సిబ్బంది

జాతీయ రహదారుల విస్తరణ జరిగిన తరువాత వాహనాల వేగం ఊపందుకుంది. ఘోర ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. అయితే ప్రమాదాలను నివారించడానికి, ప్రయాణికులకు రక్షణ కల్పించడానికి జాతీయ రహదారుల విభాగం ప్రత్యేక వాహనాలతో ఎస్కార్ట్ సిబ్బందిని ఏర్పాటుచేశారు. ఈ ఎస్కార్ట్ సిబ్బంది రాత్రి, పగలు వారికి కేటాయించిన పరిధిలో గస్తీ తిరుగుతూ ప్రమాదాలను ముందస్తుగా గుర్తించి వాటిని నివారిస్తుంటారు. ఎక్కడైనా ప్రమాదాలు జరిగినా వెంటనే సబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి క్షతగాత్రులను కాపాడాల్సి ఉంటుంది. అయితే కొడికొండ చెక్‌పోస్టు నుంచి పెనుకొండ వరకు ఉన్న ఎన్‌హెచ్ ఎస్కార్ట్ సిబ్బంది ఇటీవల గస్తీ తిరగడం లేదని స్థానికులు చెబుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం



కొడికొండ చెక్‌పోస్టు నుంచి కోడూరు తోపు వరకు రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించేలా చూస్తాం. నిబంధనలు అతిక్రమించి వాహనాలను డ్రైవ్ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతాం. కోడూరు కూడలిలో వేగనియంత్రకాలను ఏర్పాటుచేసే విషయంపై అధికారులతో మాట్లాడతాం. రోడ్డుపై ఆగిపోయిన వాహనాలను వెంటనే గుర్తించి వాటిని రోడ్డు మీద లేకుండా చర్యలు తీసుకుంటాం. ఎన్.హెచ్ ఎస్కార్ట్ సిబ్బంది గస్తీని పెంచి తక్షణం ప్రమాదాలపై నిఘా ఉండేలా చూస్తాం.

- మునీర్ అహమ్మద్, ఎస్ఐ, చిలమత్తూరు

ఉపాధి హామీ పనులతో మారుతున్న రూపురేఖలు



రంగనాథస్వామి ఆలయం వద్ద పూడికతీత పనులు (ఫైల్)

సోమందేపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు స్థానికులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో రూపొందించింది ఉపాధిహామీ పథకం. ఈ పథకం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలతో గ్రామీణ ప్రాంత రూపురేఖలు మారుతున్నాయి. ప్రభుత్వం కొలువుతీరినప్పటి నుంచి పథకాల అమలుపై ప్రత్యేక దృష్టిసారించింది. ప్రస్తుతం ఉపాధిహామీ పథకంతోపాటు ఆరురకాల నూతన పథకాలను జోడించడంతో గ్రామీణ ప్రాంతాల్లో సుందరీకరణ, బావుల పూడికతీత, చెరువకట్టల మరమ్మతులు, గోకులం మినీషెడ్లు, పశువుల నీటి తొట్టెలు, పంటకుంటలు, కంపోస్ట్ తదితర పనులు చేపడుతున్నారు. ఇటీవల గుడిపల్లిలో సజ్జఘంట రంగనాథస్వామి ఆలయ కోనేరు పూడికతీత పనులద్వారా సుందరంగా తీర్చిదిద్దారు. మండలంలో 44 చెరువులు ఉండగా తొమ్మిది చెరువుకట్టలపై జంగిల్‌క్లియరెన్స్ పూర్తి చేశారు. 295 కంపోస్ట్ పిట్లు మంజూరుకాగా వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయి. పంట కుంటలు 365 మంజూరుకాగా 304 లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 139 పూర్తయ్యాయి. 52 మినీ గోకులంషెడ్లు మంజూరుకాగా 17, 58 పశువుల నీటితొట్టెలు మంజూరుకాగా 49 పూర్తయ్యాయి. హార్టికల్చర్ కింద 180 ఎకరాలు లక్ష్యంకాగా 49 ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు.

20 నుంచి సీపీఐ మహాసభలు



మాట్లాడుతున్న డివిజన్ కార్యదర్శి శ్రీరాములు

పెనుకొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం సీపీఐ మహాసభలను ఈనెల 20నుంచి నిర్వహించడం జరుగుతోందని, విజయవంతం చేయాలని డివిజన్ కార్యదర్శి శ్రీరాములు కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహాసభల్లో తీర్మానాలు చేయనున్నామన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగం రైతుల పక్షాన పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జూలై 31 ఆగస్టు 1న ధర్మవరంలో జిల్లామహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు వెంకటేశులు, గోరంట్ల సుధాకర్, చాంద్‌బాష, ఏఐటీయుసీ నాయకులు నరసింహులు, కిష్టప్ప పాల్గొన్నారు.

సింగిల్ విండో అధ్యక్షుడిగా నరేష్



మడకశిర టౌన్, జూలై15(ఆంధ్రజ్యోతి): మడకశిర సింగల్ విండో అధ్యక్షులుగా నరేష్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్వర్యులు వెల్లడించినట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. ఆర్.అనంతపురం గ్రామానికి చెందిన నరేష్‌ను నియామకంపై పట్ల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా సింగల్ విండో డైరెక్టర్‌గా గౌడనహళ్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నరసింహప్ప, బుళ్లసముద్రం గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు చంద్రశేఖర్‌లను నియమించారు. దీంతో వారు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజుకు, మాజీ ఎమ్మెల్సీ గుండుమలతిప్పేస్వామిలకు కృతజ్ఞతలు తెలిపారు.

అమరాపురం(ఆంధ్రజ్యోతి): సింగిల్ విండో అధ్యక్షుడిగా గణేష్‌ను, డైరెక్టర్‌గా దాదాపీర్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో గణేష్‌ను సన్మానించారు.

రాళ్లపల్లిని సందర్శించిన కేంద్ర బృందం

గుడిబండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లపల్లి గ్రామాన్ని మంగళవారం కేంద్ర బృందం అధికారులు పర్యటించారు. గ్రామంలోని అంగన్‌వాడీ భవనం, గ్రామ సచివాలయం రైతు సేవా కేంద్రం, గ్రామంలోని కాలనీలను సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సంబంధిత శాఖ అధికారులతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర బృందం అధికారులు రామాంజినేయులు, శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజునాయక్, మండల సర్వేయర్ ఫణికిషోర్, పంచాయతీ కార్యదర్శి పరిపూర్ణాచారి, సర్పంచ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి

గోరంట్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులు గోరంట్ల పాత బస్టాండ్ వద్దనుంచి షాదీమహాల్‌వరకు మంగళవారం ర్యాలీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఆ హామీని నిలుపుకోవాలన్నారు. హక్కులకోసం ఐకమత్యంతో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

చెరువులకు నీరివ్వాలి

జలసాధన సమితి నాయకులు



ఎస్ఈకి వినతిపత్రం అందిస్తున్న జలసాధన సమితి నాయకులు

హిందూపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా హిందూపురం మడకశిర చెరువులకు మొదటి ప్రాధాన్యత కింద నీరు ఇవ్వాలని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురంలోని హంద్రీనీవా ప్రాజెక్ట్ ఎస్ఈ స్వరూప్‌కుమార్‌ను జలసాధన సమితి నాయకులు కలిశారు. ఈ సందర్భంగా జలసాధన సమితి నాయకులు మాట్లాడుతూ 2018లో హిందూపురం ప్రాంతానికి నీరు వచ్చినప్పటికీ ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో 265చెరువులు నింపాల్సి ఉండగా కేవలం కేవలం 40చెరువులలోపే నీరిచ్చారన్నారు. 2022నుంచి 2024వరకు చెరువులకు నీరు వదల్లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని చెరువులకు నీరివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి నాయకులు ఓపీడీఆర్ శ్రీనివాసులు, రాంకుమార్, గంగిరెడ్డి, ప్రకాశ్, నాగరాజు, వీరేంద్ర తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వైద్యాధికారి ఫైరోజ్ బేగం

అమరాపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): సీజనల్‌వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ఫైరోజ్‌బేగం.. డాక్టర్లకు సూచించారు. మండల పరిధిలోని అమరాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ వివరాలను డాక్టర్లు మనోహర్‌నాయక్, నాగేంద్రనాయక్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో సమావేశమై సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మడకశిర రూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్లను ఆదేశించారు. డాక్టర్లు నారేంద్రనాయక్, నరేష్‌కుమార్ వైద్య సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సీడప్ సంయుక్త ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్ పాస్/ఫెయిల్ 18-30సంవత్సరాలలోపు ఉన్న యువతీ యువకులు అర్హులన్నారు. మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9966682246 కు సంప్రదించాలన్నారు.

ఘనంగా ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం

అగళి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యువతకు ఉపాధి, చదువుకు తగ్గ పని తదితర విషయాలను మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్ వివరించారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మడకశిర రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్య ఎంఎస్ రాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కోనప్పపాళ్యం, కోడపల్లి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామితో కలిసి సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ నాగరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మడకశిరలో..

మడకశిర టౌన్(ఆంధ్రజ్యోతి): అర్హులకు సంక్షేమ ఫలాలు అందిస్తూ సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు, నియోజకవర్గం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కిషోర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని గాంధీబజార్, 12వ వార్డుల్లో సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉమాశంకర్, నాయకులు ఆది, కీర్తి, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.



పరిగిలో..

పరిగి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సుపరిపాలనపై తొలిఅడుగు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షులు తిప్పేస్వామి, పాళ్యం చంద్ర, గంట శ్రీనివాసులు, రమాకాంత్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



సోమందేపల్లిలో..

సోమందేపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనకు తొలిఅడుగులో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని 132, 126 బూత్‌లు, కొలిమిపల్లి, పందిపర్తి గ్రామాల్లో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కరపత్రాలు అందించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రంగేపల్లి వెంకటరమణ, మధుసూదన్, రామాంజినేయులు, అంజప్ప, రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు, నటరాజాచారి, నారాయణస్వామి, రమేష్‌యాదవ్, రంగనగోపాల్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



గోరంట్లలో..

గోరంట్ల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రయ్యగారిపల్లిలో టీడీపీ నాయకుడు పచ్చా అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి నాయకులు ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నరేంద్రరాయల్, రాజారెడ్డి, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హిరేతుర్పిలో...

గుడిబండ, (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిరేతుర్పి గ్రామంలో మంగళవారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి శ్రీనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జి భీమరాజు, నాయకులు దుర్గేష్, శశిధర్, భోజరాజు, తిమ్మప్ప, మంజునాథ్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న అంబులెన్స్

పరిగి, జూలై 15(ఆంధ్రజ్యోతి): అంబులెన్స్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. శ్రీరంగరాజులపల్లికి చెందిన ఓ వృద్ధుడు అనారోగ్యంతో అనంతపురంలో మృతిచెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున పైడేటి బస్టాండు సమీపంలో రోడ్డుపై ఆవులు కట్టేశారు. డ్రైవర్ హరి వాటిని తప్పించబోయి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. విద్యుత్‌వైర్లు తెగి కిందపడ్డాయి. ప్రాణాపాయం జరగలేదు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి విద్యుత్‌సరఫరాను ఆపివేసి మరమ్మతులు చేపట్టారు. అనంతరం విద్యుత్ సరఫరా చేశారు.

నేడు సూర్యఘర్ పథకంపై అవగాహన

హిందూపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సూర్యఘర్ పథకంపై బుధవారం సాయంత్రం 3 గంటలకు జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. కలెక్టర్ హాజరుకానున్నట్లు ట్రాన్స్‌కో రెవెన్యూ అధికారులు తెలిపారు.